బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ శుక్రవారం, 10 ఏప్రిల్-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## బహదూర్‌పల్లిలో స్క్రాప్ గోదాంలో భారీ అగ్నిప్రమాదం..

2లో..



## మంత్రి పొంగు 'లూటీ' అక్రమాలను అడుగడుగునా ఎండగడుతాం



### మాజీ మంత్రి హరీష్‌రావు హెచ్చరిక

**వనపర్తి-ఏప్రిల్ 09 :** నాదర్‌గుల్ లో 373 ఎకరాల భూమిని కబ్జాను బయటపెట్టడంతో మంత్రి పొంగులేటి కి మతిస్థిమితం కోల్పోయి బజారు భాషలో మొరుగుతున్నారని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. భూముల విషయంలో మీడియా ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా నీళ్లు నమిలి పారిపోయాడని విమర్శించారు.పొంగు 'లూటీ ' అక్రమాలను అడుగడుగునా ఎండగడుతూనే ఉంటామని హెచ్చరించారు. మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులతో కలిసి వనపర్తిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. నాదర్‌గుల్ భూముల వ్యవహారంలో అడ్డంగా దొరికిపోయి అబద్ధాలతో బొంకులేటి రంకెలేస్తున్నాడని ఆరోపించారు.ఎన్ని రంకెలేసినా, కబ్జాలు, అవినీతి బయటపెడుతూనే ఉంటామని, వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ మైనింగ్ చేసింది. మా అధికారులను పంపి మేమే ఆ దొంగల్ని పట్టుకున్నాం. నోటీసులు ఇచ్చినామని స్వయాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చెప్పినప్పుడు మౌనంగా తలకాయ కిందికి వేసి ఎందుకు కూర్చున్నావని పొంగులేటిని ప్రశ్నించారు.12 రోజుల తర్వాత ఇప్పుడు జ్ఞానోదయం అయి నేను ఒక్కడినే అవినీతి పరుడిని కాదు.. సీఎం, నా సహచర మంత్రులందరూ అవినీతి పరులేనని పరోక్షంగా ఒప్పుకున్నాడని విమర్శించారు. అడ్డంగా దొరికిపోయిన ఫ్రస్టేషన్ లో రేవంత్ రెడ్డి, భట్టి విక్ర మార్క, జూపల్లి కృష్ణారావుల కుంభకోణాలను ఆయననే బయట పెట్టారని ఆరోపించారు. ఇప్పటికైనా తప్పును ఒప్పుకుని, ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నాదర్‌గుల్ భూములు ప్రభుత్వ భూములైతే ఎందుకు హైడ్రా స్పందించడం లేదని నిలదీశారు.

మిగతా 3లో..

## లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడి..



- 250 మందికి పైగా మృతి

**ఇజ్రాయెల్, ఏప్రిల్ 09 :** అమెరికా-ఇరాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినట్లు ప్రకటన వెలువడిన వెంటనే లెబనాన్ పై ఇజ్రాయెల్ క్షిపణులతో విరుచుకుపడింది. లెబనాన్‌లోని హెజ్బొల్లా ( స్థావరాలే లక్ష్యంగా దాడులు చేసింది. ఈ దాడుల్లో భారీగా ప్రాణనష్టం జరిగింది. మొత్తం 254 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో వెయ్యి మందికిపైగా గాయపడ్డారు. అయితే కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత కూడా ఇజ్రాయెల్ లెబనాన్‌పై దాడికి పాల్పడటంతో ఇరాన్ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ క్రమంలోనే హర్మ్యూజ్ జలసంధిని మూసివేస్తున్నట్టు ప్రకటించింది.కాల్పుల విరమణ ఒప్పందం జరిగిన వెంటనే లెబనాన్‌పై ఈ దాడులు జరిగాయి. కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా తమ మిత్రపక్షాలపై కూడా దాడులు చేయకూడదని ఇరాన్ డిమాండ్ చేయగా.. ఇజ్రాయెల్ అంగీకరించలేదు. హెజ్బొల్లా

మిగతా 3లో..

## ఎప్పుడూ ప్రజా సమస్యల గురించి మాట్లాడే నాయకుడు జీవన్‌రెడ్డి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్





**హైదరాబాద్, ఏప్రిల్ 09 :** ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జగిత్యాలలోని నివాసంలో కలిసి పార్టీలో ఆహ్వానించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా జీవన్ రెడ్డిని కేటీఆర్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లా డుతూ.. కేసీఆర్, జీవన్ రెడ్డికి దశాబ్దాలకుపైగా పరస్పర గౌరవం, స్నేహం ఎప్పుడి నుంచో ఉంది. రెండు సందర్భాల్లో నా కండ్ల ముందు జరిగినయ్ గుర్తొస్తున్నాయన్నారు.2014 జూన్ 2న కేసీఆర్ ముఖ్య మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాల్లో వారి మొట్టమొదటి అధికారిక ప్రకటన ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోనే మొదలైంది. ఆ రోజు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఒక ఆడిటోరియంలో మీటింగ్ జరిగింది. జీవన్ రెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సీనియర్ నాయకుడు, ప్రతిపక్షానికి సంబంధించిన శాసనసభ్యులు.. కానీ కేసీఆర్ స్వయంగా ముందు జీవన్ రెడ్డికి మైక్ ఇవ్వండి అని చెప్పివారి మైక్ అందిస్తే వారు నేరుగా అభినందనలు చెప్పి జగిత్యాల ప్రజల తరపున నేను మిమ్మల్ని ఒకటి అడగ దలచుకున్నా బోర్నపల్లి గ్రామానికి సంబంధించి ఒక బ్రిడ్జి కావాలని ఒక్క మాట చిన్నగా అడిగారు. అప్పుడే మేం కొత్తగా మంత్రులైనం. కేసీఆర్ ఎట్లా స్పందిస్తరు చూస్తా ఉన్నం. సాధారణంగా చూస్తాం.. పరిశీలిస్తాం. అని చెప్పొచ్చు. జీవన్ రెడ్డి మీదున్న గౌరవం, ప్రేమ ఎట్టాంటిదంటే.. కేసీఆర్ రూ.70 కోట్ల బ్రిడ్జిని అక్కడికక్కడే మంజూరు చేసి కరీంనగర్ జిల్లాలోనే మొట్టమొదటి మంజూరు చేసిన బ్రిడ్జిని ఇచ్చారన్నారు..2014 ఎన్నికల ముందు కేసీఆర్ జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించారు. జీవన్ రెడ్డి నిబద్ధత గల నాయకుడు.. కాంగ్రెస్‌లోనే కొనసాగారు. అసెంబ్లీలో ఎప్పుడూ

మిగతా 3లో..

## సిరిసిల్ల కాంగ్రెస్‌లో 'పదవుల' సెగ..

- జిల్లా కార్యవర్గంలో 'ఇల్లంతకుంట' నిల్..
- ఇల్లంతకుంట నేతల ధిక్కార స్వరం..
- సామాజిక మాధ్యమాల్లో నేతల చురకలు

మిగతా 6లో..

## హర్మ్యూజ్‌పై ఇరాన్ ఆంక్షలు..



- రోజుకు 15 నౌకలకు మాత్రమే అనుమతి..!

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 09 :** పశ్చిమాసియా యుద్ధంలో రెండు వారాలు తాత్కాలిక కాల్పు ల విరమణతో హర్మ్యూజ్ జలసంధి గుండా రాకపోకలకు ఇక ఏ ఆటంకం ఉండదని భావించిన ప్రపంచ దేశాలకు షాక్ ఇచ్చింది ఇరాన్. అంత తేలికగా హర్మ్యూజ్‌పై తమ పెత్తనాన్ని వదులుకునేందుకు ఇష్టపడని ఇరాన్ కొన్ని షరతులు విధిస్తోంది. రోజుకు 15 నౌకలను మాత్రమే అనుమతించాలని భావిస్తోంది. అంతర్జాతీయ రవాణాలో

## వర్షాకాలానికి ముందే నాలాల శుద్ధి పూర్తి చేయాలి

### హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్



**హైదరాబాద్, ఏప్రిల్ 09 :** నగరంలో నాలాలు, వరద కాలువల్లో పేరుకుపోయిన పూడికను పూర్తిగా తొలగిస్తే వర్షాకాలంలో వరదలు నివాసాలను ముంచెత్తే పరిస్థితి ఉండదని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. నాలాల్లో పూడిక తొలగింపుకు ఎక్కడైనా ఇళ్ల వాకిళ్లు అడ్డుగా ఉన్నా, అవసరమైతే వెంటనే తొలగించి పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. దీంతో నీటి ప్రవాహానికి ఆటంకాలు తొలగుతాయని చెప్పారు.గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న డీసిల్టింగ్ పనులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రహ్మత్‌నగర్, కృష్ణానగర్, అమీర్‌పేట్, గాయత్రినగర్ ప్రాంతాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. నాలాలు, వరద కాలువల్లో జరుగుతున్న పనులపై వివరాలు తెలుసుకుని, వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలు, వాటి కారణాలు, పరిష్కార మార్గాలపై చర్చించారు.వేసవి కాలాన్ని సద్వినియోగం చేసుకొని అన్ని పనులు పూర్తిచేయాలని, వర్షాలు ప్రారంభమైన తర్వాత పెద్ద పనులు చేయడం కష్టమవుతుందని

మిగతా 3లో..

## రేపు ఇంటర్ ఫలితాలు!

**హైదరాబాద్, ఏప్రిల్ 09 :** ఇంటర్ పరీక్షా ఫలితాలు శనివారం విడుదలయ్యే అవకాశాలున్నాయి. ఫిబ్రవరి 25న ప్రారంభమైన ఈ పరీక్షలు మార్చి 18తో ముగిశాయి. సమాధాన పత్రాల మూల్యాంకనం గతనెలాఖరులోనే పూర్తయింది. అన్ని సబ్జెక్టులు ఉత్తీర్ణులై కేవలం ఒక సబ్జెక్టులో ఒకటి రెండు మార్కులతో ఫెయిలైన విద్యార్థుల సమాధానపత్రాలను ఈసారి మళ్లీ మూల్యాంకనం చేశారు. ఈ ప్రక్రియ కూడా ఇటీవలే ముగిసింది. విద్యాశాఖ బాధ్యతలు చూస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి అనుమతి తీసుకుని ఫలితాలను ఈనెల 11న విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈసారి ఇంటర్ పరీక్షలకు మొత్తం 9,97,075 మంది హాజరయ్యారు. వీరిలో 4,89,126 మంది ప్రథమ సంవత్సరం, 5,07,949 ద్వితీయ సంవత్సరం విద్యార్థులు.



## రైతు భరోసా రెండు, మూడో విడత నిధుల జమ



### షెడ్యూల్ ఫిక్స్- ఎవరికి ఎప్పుడు..!!

### ఈ నెలలోనే పెండింగ్ నిధుల జమకు ప్రణాళికలు

**హైదరాబాద్, ఏప్రిల్ 09 :** రైతు భరోసా పెండింగ్ నిధుల పై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రైతు భరోసా రెండో విడత నిధుల జమ పైన స్పష్టత ఇచ్చింది. మూడు విడతల్లో రైతు భరోసా నిధులను జమ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం అందులో భాగంగా తొలి విడత నిధులను విడుదల చేసింది. కాగా, రెండో విడత నిధులు ఏ కేటగిరీలో రైతుల ఖాతాల్లో జమ చేయనుందో స్పష్టం చేసింది. దీంతో, రైతు భరోసా నిధుల కోసం వేచి చూస్తున్న రైతులకు రిలీఫ్ దక్కనుంది. రైతులకు తెలంగాణ ప్రభుత్వం మరీ కీలక అప్డేట్ ఇచ్చింది. రైతు భరోసా పథకంలో భాగంగా రెండో విడత నిధులను విడుదల చేసేందుకు ప్రభుత్వం షెడ్యూల్ ఖరారు చేసింది. ఏప్రిల్ రెండో వారంలోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సీఎం రేవంత్ తాజాగా రైతుల భరోసా నిధుల పైన సమీక్ష చేసారు. రైతులకు ఇచ్చిన హామీ విధంగా నిధులు జమ చేయాలని నిర్దేశించారు. అందులో భాగంగా ఆర్థిక శాఖ రూ.2,650 కోట్లను సమీకరించే పనిలో పడింది. ప్రభుత్వ ఖర్చులు, ఇతర చెల్లింపులతో పాటుగా రైతులకు భరోసా కింద అవసరమైన నిధులు అందించేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేసారు. రెండో విడతలో ఎకరానికి మించి భూమి ఉన్న రైతులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ముఖ్యంగా సుమారు 5 ఎకరాల వరకు భూమి

మిగతా 3లో..

## ఐటీ కంపెనీలో లైంగిక వేధింపులు

- మహారాష్ట్రలో ఆరుగురు టీమ్ లీడర్ల అరెస్టు
- లైంగిక వేధింపులు, అత్యాచారం, మతపరమైన దూషణల అభియోగాలపై కేసులు నమోదు
- మరింత లోతుగా దర్యాప్తునకు సిట్ ఏర్పాటు



**నాసిక్, ఏప్రిల్ 9:** మహారాష్ట్రలో నాసిక్‌లోని ఓ ప్రముఖ ఐటీ కంపెనీలో లైంగిక వేధింపుల పర్వం కలకలం రేపుతో ంది. లైంగిక వేధింపులు, అత్యా చారంతో పాటు మతపరమైన దూషణల అభియోగాలపై ఆ కంపెనీకి చెందిన ఆరుగురు టీమ్ లీడర్లు, ఒక హెచ్ఆర్ మహిళా ఉద్యోగిని అరెస్టు చేశారు. ఈ వ్యవహారంపై మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు పోలీసు ఉన్నతా ధికారులు 'సిట్'ను ఏర్పాటు చేశారు. దర్యాప్తు సాగేకొద్దీ మరింతమంది బాధితులు ముం దుకొచ్చే అవకాశం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటి వరకు బాధితులుగా ఎనిమది మంది మహిళలతో పాటు ఓ పురుషుడు ఉండగా.. మొత్తం తొమ్మిది ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. బాధిత మహిళ లందరూ 18-25 మధ్య వయసు గలవారే! పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోష్)-2013 కింద బాధితులు అంతకుముందు ఫిర్యాదు చేసినప్పటికీ.. కంపెనీ హెచ్ఆర్ హెడ్ పట్టించుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఫిర్యాదులను

మిగతా 3లో..

## వీరి రేషన్ కార్డులు రద్దు,

- ప్రభుత్వం అనూహ్య నిర్ణయం..!!



**హైదరాబాద్, ఏప్రిల్ 09 :** రేషన్ కార్డుల పై ప్రభుత్వం అనూహ్య నిర్ణయం తీసుకుంది. అనర్హులు రేషన్ కార్డులు పొందినట్లు క్షేత్ర స్థాయిలో గుర్తిం చారు. ఇప్పుడు ఇలాంటి వాటి పైన పరిశీలన మొదలైంది. ఇటీవల విచారణ లో లక్షమందికిపైగా అనర్హు లను గుర్తించి రేషన్ కార్డు రద్దు చేశా రు. అయితే అనర్హుల గుర్తింపు ప్రక్రియ కొనసాగించాలని నిర్ణయించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు కార్డులు ఉంటే కొనసాగిం చాలని.. అర్హత లేకపోయినా కార్డులు పొంది ఉంటే వాటిని రద్దు చేయాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. వారికి నోటీసులు జారీ చేసి నోటీసు ప్రక్రియ పూర్తి చేయాలని డిసైడ్ అలయ్యారు.కేంద్రం.. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుల్లో అనర్హులను తెలిగిస్తోంది. క్షేత్ర స్థాయి నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు అధికారులు పరిశీలన ప్రారంభించారు. ప్రధానంగా హైదరాబాద్‌లో దాదాపు 2 లక్షల మంది ఐటీ చెల్లింపుదారులు రేషన్ కార్డులు కలిగి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. టీజీ విజిలెన్స్ విభాగం రహస్య ఆడిట్‌లో ఈ విషయం బయటపడింది. దీంతో వీరి రేషన్ కార్డులను రద్దు చేయడంతో పాటు ఇప్పటివరకు పొందిన సబ్సిడీలను రికవరీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

మిగతా 3లో..

## మక్కల కొనుగోలు కేంద్రాలు మీరు తెరవాలి

### మార్క్‌ఫెడ్ అధికారులపై ఎమ్మెల్యే సంజయ్ ఆగ్రహం



హైదరాబాద్, ఏప్రిల్ 09 : మక్కల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకుండా రైతులను ఇబ్బంది పెట్టడంపై కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మండిపడ్డారు. మార్క్‌ఫెడ్ అధికారులకు ఫోన్ చేసి, కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు తెరుస్తారని నిలదీశారు. నెల రోజులుగా మక్కలు ఎప్పుడు కొంటారని రైతులు రోడ్ల మీద ఎదురు చూస్తుంటే మజాక్‌గా ఉందా అని మండిపడ్డారు.రైతులు నెల రోజుల నుంచి ఇబ్బందులు పడుతుంటే మీకు కామెడీగా ఉందా అని మార్క్‌ఫెడ్ అధికారులపై కల్వకుంట్ల సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించమని అడిగితే నాలుగు రోజుల తర్వాత తెరుస్తామని అంటారా అని మండిపడ్డారు. ఇదేనా మీ బాధ్యత అని నిలదీశారు. మీకు ఎందుకింత అహంకారమని ప్రశ్నించారు. ఈ రోజు వెంటనే మొక్కజొన్న కేంద్రాలను ప్రారంభించాలని ఆదేశించారు. లేదంటే నేనే వెళ్లి మొక్కజొన్న కేంద్రాలను ప్రారంభిస్తానని.. మీరు వస్తారో.. రారో.. మీ ఇష్టమంటూ మండిపడ్డారు.

## జీవన్ రెడ్డి పార్టీని వీడడం బాధాకరం..



హైదరాబాద్, ఏప్రిల్ 09 : సీనియర్ నాయకుడు టి.జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడడం బాధాకరమని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడం ఖాయమవ్వడంతో ఢిల్లీ నాయకత్వం చొరవ చూపి ఉంటే సమస్య పరిష్కా రమయ్యేదని జగ్గారెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. పార్టీ ఫిరాంపులపై కాంగ్రెస్ వైఖరిని ఖండిస్తూ వచ్చిన ఆయన గులాబీ జెండా కప్పుకోనున్న నేపథ్యంలో జగ్గారెడ్డి ఏఐసీసీ స్థాయిలో చర్చ అవసరమని పేర్కొన్నారు.జగిత్యాల సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి కాంగ్రెస్ వీడడంపై ఆ పార్టీ సీనియర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ కుటుంబానికి, కాంగ్రెస్ పార్టీకి విధేయుడుగా ఉన్న జీవన్‌రెడ్డి పార్టీని వీడడం బాధాకరం అని పేర్కొన్నాడు. కీలక నేత దూరమవ్వడంపై స్పందించిన ఆయన అంతర్గతంగా ఏం జరుగుతుందో ఏఐసీసి స్థాయిలో చెక్ చేసుకొని ఉండాల్సింది అని తెలిపారు.కొన్ని రోజులుగా కాంగ్రెస్ పార్టీ తీరుతో అసంతృప్తిగా ఉన్న జీవన్ రెడ్డితో నేరుగా ఢిల్లీ నాయకత్వమే మాట్లాడి.. నేరుగా రంగం లోకి దిగి సమస్యను పరిష్కరించి ఉంటే బాగుండేది అని ఆయన వెల్లడించారు. అయితే.. ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని జగ్గారెడ్డి తెలిపారు. జీవన్ రెడ్డి పార్టీ మారడానికి గల కారణాలను బహిరంగంగా మీడియాతో చెప్పలేమని.. అంతర్గతంగా పార్టీలో చర్చిస్తామని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

## ఏసీబీ వలలో ఫారెస్టు రేంజ్ అధికారి, జూనియర్ అసిస్టెంట్



ఆదిలాబాద్-ఏప్రిల్ 09 : జిల్లాలో బోథ్ ఫారెస్టు రేంజ్ అధికారి, జూనియర్ అసిస్టెంట్ లంచం తీసుకుంటూ ఏసీబీ వలకు చిక్కారు. హరిత హారంలో జాతీయ గ్రామీణ హామీ ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన చెక్ డ్యాంలో నీటిని నింపిన బాధితుడికి సుమారు రూ.5లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.ఈ బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరిగిన బాధితుడు చివరకు బోథ్ ఫారెస్టు రేంజ్ అధికారి టి. ప్రణయ్ రూ. 15 వేల డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు జూనియర్ అసిస్టెంట్ పరుశురాంకు రూ.15 వేలు ఇస్తుండగా ఏసీబీ పట్టుకుంది. విచారించగా ఎఫ్ఆర్‌వో ఆదేశాల మేరకు డబ్బు తీసుకున్నట్లు అంగీకరించడంతో ఇద్దరిని కస్టడీలోకి తీసుకుని విచారించి కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.

## వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం..




### బాధ్యులపై చర్యలు

వరంగల్-ఏప్రిల్ 09 : వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం రేపింది. సోషల్ మీడియాలో సీనియర్లపై కామెంట్స్ చేసిన థర్డ్ ఇయర్ విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్ కమిటీ చర్యలకు సిఫారసు చేసింది. వాటిని కళాశాల అమలు చేసింది. ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం వాట్సాప్ గ్రూప్‌లో సీనియర్లపై కామెంట్ చేశారని ద్వితీయ సంవత్సరం విద్యార్థులను ర్యాగింగ్ పేరుతో థర్డ్ ఇయర్ విద్యార్థులు మోకాళ్లపై కూర్చోబెట్టారు.బాధిత విద్యార్థులు ఈ విషయాన్ని కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీకి పిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా కమిటీ విచారణ చేపట్టి కారకులను మూడు నెలల అకడమిక్ సస్పెన్షన్, శాశ్వత హాస్టల్ వసతిని రద్దు చేస్తూ చర్యలకు సిఫారసు చేసింది. కమిటీ సిఫారసులను కళాశాల అమలు చేసింది. అయితే, దీనికి సంబంధించిన పూర్తి వివరాలను అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

# ప్రేమ పేరుతో మోసం..

### లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష



వరంగల్, ఏప్రిల్ 09 : అప్పటికే పెళ్లయిన నిందితుడు తాను అవివాహితుడంటూ నమ్మించి ఓ యువతి (బాధిత యువతి)ని ప్రేమిస్తు న్నానని , పెళ్లి కూడా చేసుకుంటానని చెప్పి.. ఆమెను శారీరకంగా అనుభవించాడు. అంతే కాక సదరు యువతి ఆస్తులు ఆభరణాలు సుమారు రూ.90 లక్షలు కాజేసిన నిందితునికి 10 సంవత్సరాలు జైలు శిక్ష 55 వేల జరిమానాతోపాటు నిందితుని తండ్రికి వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ వరంగల్ మొదటి అదనపు జిల్లా జడ్జ్ జి. ప్రేమలత గురువారం సంచలన తీర్పు వెలువరించారు.కేసు పూర్వపరాల్లోకి వెళితే.. వరంగల్ నగరంలోని గణేష్ నగర్‌కు చెందిన సూరిశెట్టి హరిత అనే బాధిత మహిళ హనుమకొండకు వచ్చిన సందర్భంలో 2017 సంవత్సరంలో వరంగల్ నగరం ఎల్లంబజార్‌కు చెందిన ఆకుతోట శిరీష్ పరిచయమయ్యాడు. యువతి ఫోన్ నెంబర్ సేకరించి తాను అవివాహితుడిని అని, తాను ఆమెను ప్రేమిస్తున్నానని పెళ్లి కూడా చేసుకుంటానని నమ్మించి ఆమెపై లైంగిక దాడి కూడా చేశాడు.

### పెళ్లై సంతానం కూడా ఉన్న నిందితుడు..

పైగా మన భవిష్యత్తు బాగుంటుంది మనం ఎలాగో పెళ్లి చేసుకుంటాం కదా అని నమ్మించి సదరు యువతికి తన కుటుంబం ద్వారా సంక్రమించిన ఆస్తిపాస్తులను నగదును క్రెడిట్ కార్డులను వాడుకొని సుమారు రూ.90 లక్షల నష్టం చేశాడు. కొద్ది రోజుల్లోనే యువతి తనకు జరిగిన మోసాన్ని గ్రహించి పెళ్లై సంతానం కూడా ఉన్న నిందితుడు శిరీష్ ను నిలదీసింది. తాను అత్యంత పలుకుబడి కలిగిన వ్యక్తినని తనకు అడ్డొస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించాడు. ఈ క్రమంలో ఇంటికి వెళ్లిన సదరు యువతిని తండ్రి ఆకుతోట సుధాకర్ అలియాస్ జాూా సుధాకర్ బెదిరించాడు.గత్యంతరం లేక సదరు యువతి 07-09-2021రోజున మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో నిందితునిపై ఫిర్యాదు చేయగా.. భారతీయ శిక్షాస్మృతిలోని 417, 420, 376 తో పాటు 506 కింద క్రిమినల్ కేసు నమోదు చేసి తగిన సాక్షాదారులతో అప్పటి సీఐ మస్క శ్రీనివాస్ చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసులో బాధితురాలు పక్షాన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బృందాదేవి వాదించగా.. లైసెన్ ఆఫీసర్ దేవరకొండ వెంకటేశ్వర్లు కోర్టు డ్యూటీ పోలీస్ ఆఫీసర్ దౌడు ప్రతాప్ చిన్నగారి రాజులు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. తగుసాక్షాదారులతో నేరం రుజువైందని భావించిన న్యాయమూర్తి ప్రేమలత నిందితునికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు 55 వేల జరిమానాతో పేస్టు నిందితుని తండ్రి సుధాకర్‌కు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

# రైతులందరు ఐకేపీ కేంద్రాలను వినియోగించుకోవాలి

### ● ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



జనగామ, ఏప్రిల్ 09 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం జనగామ మండలంలోని పెంబర్తి, వడ్లకొండ, ఎర్ర గొల్ల పహాడ్, అడవి కేశవాపురం గ్రామాల్లో దాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం అమ్మకాలలో సమస్యలు ఉంటే వెంటనే తెలియజేయాల న్నారు. రైతుల సమస్యలను నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నామని గ్రామాభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. మహిళా సంఘాలు మరింత బలోపేతం కావాలని మిల్లర్లు ఇబ్బందులు పెడితే చర్యలు తీసుకుంటామ న్నారు. రైతుల ధాన్యం అమ్మిన తర్వాత చెల్లింపులు ఆలస్యమైతే త్వరగా జమ చేయిస్తానని , ప్రతి కొనుగోలు కేంద్రంపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. ధాన్యం అమ్మకాలలో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే ఉన్నతాధికా రులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.పాత బకాయిలు ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రెండున్నరేళ్లుగా రైతుల సమస్యలను నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నామని వెల్లడించారు. మిల్లర్లు ఇబ్బందులు పెడితే కచ్చితంగా వారితో మాట్లాడి పరిష్కరి స్తానని స్పష్టం చేసారు. జనగామ నియోజక వర్గంలోని ప్రతి కొనుగోలు కేంద్రంపై ప్రత్యేక దృష్టి పెట్టి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బాధ్యతగా తీసుకుం టానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, సర్పంచులు చిన్నబోయిన రేఖ, కాయిదాపురం మహేందర్ రెడ్డి, చిర్ర సత్య నారాయణరెడ్డి, భూ రెడ్డి చైతన్య ప్రమోద్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బాల్దే సిద్ధి లింగం, నాయకులు బైరగోని యాదగిరి గౌడ్, చంద్రం గౌడ్, సీఈవో భాస్కర్ రెడ్డి, రామ్మోహన్, పిఏసిఎస్ మాజీ చైర్మన్ చిర శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్లు తనిఖీ చేసిన జేఎండీ



హైదరాబాద్-ఏప్రిల్ 09 : జలమండలి ఓ అండ్ ఎం డివిజన్-6 ఎస్.ఆర్. నగర్ లో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ పర్యటించారు. డివిజన్ పరిధిలో ట్యాంకర్ డిమాండ్ అధికంగా ఉన్న.. జూబ్లీహిల్స్, వెంకటగిరి ఫిల్లింగ్ స్టేషన్లను ఆయన సందర్శించారు. ట్యాంకర్ బుకింగ్ స్టేటస్, రోజుకి ఎన్ని ట్యాంకర్లు బుక్ అవుతున్నాయి?, ఎన్ని డెలివరీ చేస్తున్నారు? తదితర వివరాలు తనిఖీ చేశారు.ఫిల్లింగ్ స్టేషన్ లో పెండింగ్‌లో ఉన్న ట్యాంకర్ సరఫరాలపై వివరాలు తెలుసుకుని నిర్వహణ పరిస్థితులను పరిశీలించారు. వెంకటగిరి ఫిల్లింగ్ స్టేషన్ వద్ద నీటి ప్రవాహం మరియు అందుతున్న నీటి పరిమాణాన్ని సమీక్షించి, ప్రస్తుత డిమాండ్‌ను తీరుస్తున్న సరఫరా సరిపోతుందా అని ఆరదీశారు చేశారు.ఈ సందర్భంగా ట్యాంకర్‌లను సమయానికి పంపిణీ చేయడం అత్యంత ముఖ్యమని పేర్కొన్న ఆయన, పెండింగ్‌లో ఉన్న అన్ని ట్యాంకర్‌లను ఎటువంటి ఆలస్యం లేకుండా తక్షణమే క్లియర్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, ట్యాంకర్‌ల కదలికపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ, విభాగాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసి, ట్యాంకర్ డెలివరీలో ఆలస్యం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సీజీఎం ప్రభు, జీఎం ప్రభాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ మౌనం దేశానికే సిగ్గుచేటు : కె.నారాయణ



హైదరాబాద్-ఏప్రిల్ 09 అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై దాడి చేస్తుంటే ప్రపంచంలో అతిపెద్ద జనాభా దేశం, అతిపెద్ద ప్రజాస్వామ్యం అయిన భారత్ నేడు మౌనం పాటించడం సిగ్గుచేటనిసీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ప్రపంచం మొత్తం తిరిగి వస్తుంటాడు. కానీ, యుద్ధంలో అమాయక పిల్లలు, నిరపరాధ ప్రజలు ప్రాణాలు కోల్పోతుంటే చూస్తూ ఊరుకోవడం ఇదేనా మన విదేశాంగ విధానం అని సూటిగా ప్రశ్నించారు. ఇంకా ఆశ్చర్యం ఏమిటంటే మధ్యవర్తిత్వానికి ముందుకు వస్తోందిభారత్ చేయాల్సిన పని పాకిస్తాన్ చేస్తుంటే మనం ఇంకా ఎందుకు మౌనంగా ఉండాల్సి వస్తుందని నిలదీశారు. ఇలాంటి క్లిష్ట సమయంలో దేశ ప్రధాని ఒక అడుగు ముందుకు వేసి యుద్ధాన్ని ఆపే ప్రయత్నం చేయకపోతే ఆ పర్యటనల అర్థమేంటన్నారు. గతంలో రష్యా, జర్మనీ, వియాత్నాం, క్యూబా, చైనా, ఇటలీ దేశాలకు వెళితే... సాధారణ ప్రజలు భారతీయులను ఎంతో ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంటూ ఇందిరా గాంధీని గుర్తు చేసుకునేవారు. అదే భారత్ గౌరవం, అదే భారత్ ప్రభావం అన్నారు. ఈరోజు ఆ స్థాయి ఎందుకు కనిపించడం లేదన్నారు. ఇది స్పష్టంగా నాయకత్వ వైఫల్యం అన్నారు. కష్ట కాలంలో సంధి కుదిర్చే ఒక గొప్ప అవకాశాన్ని మనం కోల్పోయాం అని ఆవేదన వ్యక్తం చేశారు.

## బహదూర్‌పల్లిలో స్క్రాప్ గోదాంలో భారీ అగ్నిప్రమాదం..



### ● పక్కన అపార్ట్‌మెంట్‌లోకి మంటలు!

హైదరాబాద్-ఏప్రిల్ 09 : మేడ్చల్ జిల్లాలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. దుండిగల్ పరిధి బహదూర్‌పల్లి గ్రీన్‌హిల్స్ కాలనీలోని డెకరేషన్ స్క్రాప్ గోదాంలో మంటలు చెలరేగాయి. అగ్నికీలలు వేగంగా వ్యాపించడంతో పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌లో పార్క్ చేసిన వాహనాలకు కూడా మంటలు అంటుకున్నాయి.ఈ అగ్నిప్రమాదం కారణంగా కాలనీలో దట్టమైన పొగ వ్యాపించింది. ఎగిసిపడుతున్న మంటలు, కమ్మేసిన పొగతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. అగ్నిప్రమాదంపై సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేసేందుకు యత్నిస్తున్నారు. మరోవైపు జీడిమెట్ల పారిశ్రామికవాడలోనూ భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

## పోలీసులూ.. అవినీతికి దూరంగా ఉండండి..

### ● డీజీపీ శివధర్‌రెడ్డి వార్నింగ్



హైదరాబాద్, ఏప్రిల్ 9: 'యూనిఫామ్, అవినీతి రెండూ కలిసి ఉండలేవు.. శాంతి భద్రతలు కాపాడవలసిన వారు అక్రమ సంపాదనకు అలవాటు పడితే కఠిన చర్యలు తప్పవు' అంటూ డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తొలిరోజుల్లోనే బీ శివధర్‌రెడ్డి పోలీసు సిబ్బందికి లేఖ రాశారు. అందులో పలు అంశాలు ప్రస్తావిస్తూ సున్నితంగా హెచ్చరించారు. అయినా, లంచాలు తీసుకోవడంలో పోలీసుల తీరులో ఎలాంటి మార్పు రావడం లేదు. దీంతో బుధవారం మరోసారి 'పోలీసులు అవినీతికి దూరంగా ఉండండి. ప్రజా సమస్యలు పరిష్కరించండి, శాంతిభద్రతలు కాపాడండి' అంటూ డీజీపీ హెచ్చరించారు.ఏసీబీకి వరుసగా చిక్కుతున్న పోలీసులు.. పోలీసులు లంచాలు తీసుకుంటు న్నారని ఏసీబీకి ప్రజల నుంచి దర్యాప్తులు వెల్లువెత్తుతుండటంతో ఏసీబీ కూడా వేగాన్ని పెంచింది. తాజాగా, శంషాబాద్‌లోని ఆర్‌జీఐ ఎయిర్‌పోర్ట్ పోలీస్ అవుట్ పోస్టులో ఇన్‌స్పెక్టర్ సంపాతి కనకయ్య, ఎస్సై యూ కే సిద్ధేశ్వర్ ఒక కేసులో చార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు, నిందితుల కుటుంబసభ్యులను అరెస్ట్ చేయకుండా ఉండేందుకు రూ.5లక్షలు లంచం డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి రూ. 2 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వారిని పట్టుకున్నారు.

## ఏసీబీకి చిక్కిన ఆర్ఐ..

### ● రూ.10వేలు లంచం తీసుకుంటు పట్టుబడ్డ అధికారి



పెద్దపల్లి-ఏప్రిల్ 09 : జిల్లాలోని అంతర్గాం మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సెదంక శ్రీమాన్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధి కారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. భూభారతి చట్టం, 2025 ప్రకారం, ఫిర్యాదుదారు తల్లికి చెందిన భూమికి సంబంధించి క్షేత్రస్థాయి విచారణ నిర్వహించి నివేదికను తహసీల్దార్‌కు పంపించాలని ఆర్‌ఐను కోరగా అందుకు లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. గురువారం తహసీల్ కార్యాలయం లో రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా కరీంనగర్ యూనిట్‌కు చెందిన ఏసీబీ అధికారులకు చిక్కాడు. అతడిపై కేసు నమోదు చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరు పర్చామని అధికారులు వివరించారు.

(మొదటిపేజీ తరువాయి)

## వర్షాకాలానికి ముందే నాలాల శుద్ధి పూర్తి చేయాలి

అధికారులకు సూచించారు. ఈ వర్షాకాలంలో ఎక్కడా వరద ప్రవాహానికి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారం అందించాలి

డివిజన్‌ల వారీగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి డీసిల్టింగ్ పనుల పురోగతిపై నిరంతరం సమాచారం అందించాలని కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులను కమిషనర్ కోరారు. వర్షాకాలంలో సమస్యలు ఎదుర్కొనే వారు స్థానికులేనని, సమస్యల స్థానం, కారణాలు, పరిష్కారాలు వారికి స్పష్టంగా తెలిసి ఉంటాయని పేర్కొన్నారు. ఆ సమాచారం అధికారులకు అందిస్తే తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. రహ్మత్‌నగర్ వంతెన వద్ద పెద్ద మొత్తంలో పూడిక తొలగింపు పనులను పరిశీలించిన కమిషనర్, కృష్ణానగర్‌లో వేసవికాలంలోనే మురుగు నీరు రహదారులపైకి రావడాన్ని గమనించారు. ప్రతి 100 మీటర్లకు పూడిక తొలగింపు పనులపై స్పష్టత ఉండాలని సూచించారు.ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తినా, అవసరమైన యంత్రాంగం కావాలన్నా వెంటనే తెలియజేయాలని జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులకు ఆదేశించారు. డీఆర్ఎఫ్ సిబ్బంది పూర్తి సహకారం అందిస్తారని, పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటారని తెలిపారు.

## హర్మ్యూజ్‌పై ఇరాన్ ఆంక్షలు..

కీలకమైన ఈ జలసంధిని దాటాలంటే కొన్ని నియమాలు వర్తిస్తాయని ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ మెలికి పెట్టడం చర్చనీయాంశమవుతోంది.అమెరికా, ఇరాన్‌లు రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకరించడంతో సంబురపడిన ప్రపంచ దేశాలకు అంతలోనే షాకింగ్ న్యూస్. ఇంతముందులా హర్మ్యూజ్ జలసంధి గుండా నౌకల రవాణా కొనసాగడానికి ఇరాన్ అభ్యంతరం చెబుతోంది. టోల్ వసూలు చేయాలని భావించిన ఇరాన్.. తమ ఆధిపత్యాన్ని చెలాయించేందుకు షరతులు విధిస్తోంది. రోజుకు 15 నౌకలకు మాత్రమే అనుమతిస్తామని పాకిస్థాన్‌తో చర్చలకు ముందే ఇరాన్ సీనియర్ వర్గాలు రష్యా వార్త సంస్థ టీఏఎస్ఎస్‌కు స్పష్టం చేశాయి. ప్రతి నౌక హర్మ్యూజ్‌ను దాటాలంటే అందుకు ఇరాన్ అనుమతితో పాటు కొన్ని ప్రత్యేక నిబంధనలు పాటించడం తప్పనిసరని వెల్లడించాయి.

## లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడి..

చేసే దాడులను అడ్డుకొనే లక్ష్యంతో లిటాని నది వరకు బఫర్‌జోన్‌ను ఏర్పాటు చేసుకోవడానికి మార్చి 2న ఇజ్రాయెల్ సైన్యం లెబనాన్‌లో గ్రౌండ్ ఆపరేషన్ ప్రారంభించింది. ఇప్పుడు ఆ ఆపరేషన్‌ను ఆపేందుకు ఇజ్రాయెల్ సుముఖంగా లేదు. కాల్పుల విరమణ ప్రకటన అనంతరం 10 నిమిషాల వ్యవధిలో లెబనాన్‌లోని పలు ప్రదేశాలపై ఇజ్రాయెల్ 100 ఎయిర్ స్ట్రయిక్స్ చేపట్టింది.

## ఎప్పుడూ ప్రజా సమస్యల గురించి మాట్లాడే నాయకుడు జీవన్‌రెడ్డి

ప్రజా సమస్యల గురించి ముఖ్యంగా రైతుల చాలా గట్టిగా మాట్లాడే నాయకుడు. జగిత్యాల జిల్లాలో నిజాం షుగర్స్ చాలా ముఖ్యమైనదని.. దాన్ని ఖచ్చితంగా తెరిపించాల్సిందేనని విద్యాసాగర్ రావు, జీవన్ రెడ్డి ఇద్దరూ కొట్లాడేవారు. షుగర్ ఫ్యాక్టరీని ఖచ్చితంగా తెరిపించాల్సిందే.. మేం కూడా మాటిస్తున్నాం. కానీ పక్కనే ఉన్న మహారాష్ట్రలో (అప్పుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి) సహకార వ్యవస్థలో అక్కడి షుగర్ మిల్లులు చాలా బ్రహ్మాండంగా నడుస్తున్నయ్.టెస్కాబ్ చైర్మన్, మాజీ అధ్యక్షుడు రవిందర్ రావు కూడా ఇక్కడే ఉన్నరు. అట్లాకో ఆపరేటివ్ వ్యవస్థను బాగు చేస్తే బాగుంటది జీవన్ రెడ్డి గారు ఒకవేళ మీకు కావాలనుకుంటే ప్రభుత్వం నుంచి రూ.250 నుంచి 300 కోట్లు పెట్టేందుకు కూడా మేం సిద్ధంగా ఉన్నామని.. అవసరమైత మీరే దానికి చైర్మన్‌గా ఉండండి.. అని చెప్పి నిండు శాసన సభలో కేసీఆర్ ఆనాడు జీవన్ రెడ్డిగారికి ఎలాంటి భేషజానికి పోకుండా ఓపెన్‌గా చెప్పారని కేటీఆర్ గుర్తు చేశారు. అంతకుముందు జగిత్యాల శివారులో బీఆర్ఎస్ శ్రేణులు కేటీఆర్‌కు స్వాగతం పలికాయి. అక్కడి నుంచి బైక్ ర్యాలీతో జీవన్ రెడ్డి నివాసానికి చేరుకున్నారు. కేటీఆర్ రాకతో జీవన్ రెడ్డి నివాసంతో పాటు జగిత్యాల పట్టణం గులాబీమయంగా మారింది.

## అక్రమాలను అడుగడుగునా ఎండగడుతాం

పేదల ఇండ్లను కూలుస్తున్న హైడా పొంగు లూటీ భూములు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఈ సమావే శంలో మాజీ ఎమ్మెల్యేలు అల వెంకటేశ్వర్ రెడ్డి, అంజయ్య యాదవ్, రాష్ట్ర నాయకులు నాగం తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా రెండు, మూడో విడత నిధుల జవ



కలిగిన రైతులు ఈ దఫాలో ప్రయోజనం పొందనున్నారు. కాగా, ప్రభుత్వం ఇప్పటికే మొదటి విడతలో ఇప్పటికే 70 లక్షల మంది రైతులకు రూ.3,590 కోట్లను మార్చి 22న జమ చేశారు. దీంతో వ్యవసాయ పనులకు కొంత ఆర్థిక ఊరట లభించింది. మిగతా రైతులకు మూడో విడతలో నిధులు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఈనెల చివరినాటికి మొత్తం చెల్లింపులు పూర్తి చేయాలని నిర్ణయించింది. అయితే, ప్రతి సీజన్‌కు ఎకరాకు రూ.6 వేల చొప్పున సాయం అందిస్తున్న ప్రభుత్వం, మొత్తం పథకం అమలుకు దాదాపు రూ.9 వేల కోట్లు అవసరమని అంచనా వేసింది. నిధుల పరిమితి కారణంగా ఈసారి మూడు దశల్లో డబ్బులు విడుదల చేస్తోంది. ఇప్పుడు రెండో విడత నిధుల పైన స్పష్టత రావటంతో పెద్ద సంఖ్య లో రైతులకు ప్రయోజనం దక్కనుంది. అదే విధంగా మూడవ, చివరి విడతను ఏప్రిల్ నెలాఖరు లోగా జమ చేయాలని నిర్ణయించింది. దీని ద్వారా రైతు భరోసా పంపిణీ పూర్తి చేసేందుకు షెడ్యూల్ ఫిక్స్ చేసారు.

# బట్టబయలవుతున్న పాకిస్థాన్ కుట్ర బుద్ధి..

## “కీలుబొమ్మ”గా మారిందా ??



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 09 :** అమెరికా-ఇరాన్ మధ్య ఇటీవల కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం వెనుక ఉన్న అసలు రాజకీయ వ్యూహం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో చర్చకు దారి తీస్తోంది. పైకి చూస్తే శాంతి ప్రయత్నంలా కనిపించిన ఈ ఒప్పందం వెనుక పెద్ద దేశాల మధ్య గల గుప్త రాజకీయ కసరత్తులు దాగి ఉన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా పాకిస్థాన్ పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతుండగా, అది స్వతంత్రంగా కాకుండా అమెరికా ప్రభావంతో పనిచేసిందన్న ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. అంతర్జాతీయ మీడియా నివేదికల ప్రకారం, వైట్ హౌస్ మొదట యుద్ధానికి సిద్ధమైనా, చివరకు చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ఇరాన్పై నేరుగా ఒత్తిడి తేవడం కష్టమవుతుందని భావించి, దానికి సమీప దేశమైన పాకిస్థాన్‌ను మధ్యవర్తిగా ఉపయోగించుకుంది. సరిహద్దు సంబంధాలు, ప్రాంతీయ ప్రభావం దృష్ట్యా పాక్‌ను ఈ వ్యూహంలో కీలకంగా వినియోగించారని సమాచారం. ఈ వ్యవహారంలో షాబాజ్ షరీఫ్ పాత్ర కూడా వివాదాస్పదంగా మారింది. ఆయన చేసిన సోషల్ మీడియా ప్రకటనలు కూడా స్వతంత్ర నిర్ణయాలు కాకుండా, అమెరికా అనుమతి తీసుకున్న తర్వాతే విడుదలైనవని నివేదికలు సూచిస్తున్నాయి. ఇది పాకిస్థాన్ స్వతంత్ర దౌత్య విధానంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. మొదట అమెరికా ప్రతిపాదనను తిరస్కరించిన ఇరాన్, చివరికి ఒప్పుకోవడానికి మరో కారణం కూడా ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. పాకిస్థాన్, చైనా సహాయాన్ని ఆశ్రయించగా, బీజింగ్ జోక్యం వల్లే ఇరాన్ తన నిర్ణయాన్ని మార్చుకుందని సమాచారం. ఇది ఈ ఒప్పందం కేవలం ద్వైపాక్షిక అంశం కాదని, అంతర్జాతీయ శక్తుల సమీకరణ ఫలితమని స్పష్టం చేస్తోంది. ఇస్లామాబాద్‌లో జరగనున్న శాంతి సమావేశం ఈ వ్యవహారంలో మరో కీలక దశగా భావిస్తున్నారు. ఇందులో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ పాల్గొననున్నారు. ఈ సమావేశం ద్వారా అమెరికా రెండు ముఖ్య లక్ష్యాలను సాధించాలని చూస్తోంది-ఒకవైపు ఇరాన్‌పై ఒత్తిడి కొనసాగించడం, మరోవైపు పాకిస్థాన్‌ను తమ వ్యూహాత్మక భాగస్వామిగా మరింత బలపరచడం. ఇదే సమయంలో ఇరాన్ వైఖరిలో కూడా మార్పు కనిపిస్తోంది. అధికారికంగా పాకిస్థాన్‌ను నిందించకపోయినా, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి చేసిన వ్యాఖ్యలు స్పష్టమైన సంకేతాలను ఇస్తున్నాయి. అమెరికా ఇచ్చిన హామీలను పాటించడం లేదని ఆయన వ్యాఖ్యానించడం, ఈ ఒప్పందంపై ఇరాన్ అసంతృప్తిని బయటపెడుతోంది. ఇక ప్రాంతీయ భద్రతా పరిస్థితులు కూడా ఈ ఒప్పందంతో పూర్తిగా స్థిరపడలేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ముఖ్యంగా లెబనాన్, సిరియా వంటి ప్రాంతాల్లో జరుగుతున్న పరిణామాలు, ఈ కాల్పుల విరమణ దీర్ఘకాలికంగా నిలుస్తుందా అన్న అనుమానాలను పెంచుతున్నాయి. మొత్తంగా చూస్తే, ఈ కాల్పుల విరమణ ఒప్పందం శాంతి కోసం కంటే రాజకీయ ప్రయోజనాల కోసం ఎక్కువగా ఉపయోగించబడిందన్న అభిప్రాయం బలపడుతోంది. ఇరాన్‌తో ఉన్న సంబంధాల కంటే అమెరికా వ్యూహాలకు పాకిస్థాన్ ప్రాధాన్యత ఇచ్చిందన్న విమర్శలు అంతర్జాతీయ వర్గాల్లో మరింత వేగం పుంజుకున్నాయి. భవిష్యత్తులో ఈ ఒప్పందం ఎలాంటి మార్పులకు దారితీస్తుందో అన్నది ఇప్పుడు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. ఇదే సమయంలో ఇరాన్ వైఖరిలో కూడా మార్పు కనిపిస్తోంది. అధికారికంగా పాకిస్థాన్‌ను నిందించకపోయినా, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి చేసిన వ్యాఖ్యలు స్పష్టమైన సంకేతాలను ఇస్తున్నాయి. అమెరికా ఇచ్చిన హామీలను పాటించడం లేదని ఆయన వ్యాఖ్యానించడం, ఈ ఒప్పందంపై ఇరాన్ అసంతృప్తిని బయటపెడుతోంది. ఇక ప్రాంతీయ భద్రతా పరిస్థితులు కూడా ఈ ఒప్పందంతో పూర్తిగా స్థిరపడలేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ముఖ్యంగా లెబనాన్, సిరియా వంటి ప్రాంతాల్లో జరుగుతున్న పరిణామాలు, ఈ కాల్పుల విరమణ దీర్ఘకాలికంగా నిలుస్తుందా అన్న అనుమానాలను పెంచుతున్నాయి. మొత్తంగా చూస్తే, ఈ కాల్పుల విరమణ ఒప్పందం శాంతి కోసం కంటే రాజకీయ ప్రయోజనాల కోసం ఎక్కువగా ఉపయోగించబడిందన్న అభిప్రాయం బలపడుతోంది. ఇరాన్‌తో ఉన్న సంబంధాల కంటే అమెరికా వ్యూహాలకు పాకిస్థాన్ ప్రాధాన్యత ఇచ్చిందన్న విమర్శలు అంతర్జాతీయ వర్గాల్లో మరింత వేగం పుంజుకున్నాయి. భవిష్యత్తులో ఈ ఒప్పందం ఎలాంటి మార్పులకు దారితీస్తుందో అన్నది ఇప్పుడు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది.

# రాష్ట్రానికి 7వ వేతనగా సంఘం వర్తింపు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 09 :** అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ప్రధానమంత్రినరేంద్ర మోదీ ఈ మధ్యాహ్నం పశ్చిమ బెంగాల్‌లో పర్యటించారు. హల్దియాలో భారీ బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగించారు. పశ్చిమ బెంగాల్ పై హామీల వర్షాన్నికురిపించారు. ఆరు అత్యంత కీలకమైన గ్యారెంటీలను ప్రకటించారు. ప్రజలకు పూర్తి జవాబుదారీతనం గల పాలన, చట్టబద్ధతపై విశ్వాసం పునరుద్ధరణ దీని లక్ష్యమని ఆయన వివరించారు. 7వ వేతన సంఘం అమలు, తృణమూల్ పాలనలోని అవినీతి, కుంభకోణాలు, మహిళలపై నేర కేసుల తిరిగి తెరవడం వంటివి ఉన్నాయి.మమత బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గూండాయిజంగా అభివర్ణించారు ప్రధాని మోదీ. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఏ ఒక్క తృణమూల్ గూండా కూడా చట్టం నుండి తప్పించుకోలేదని హెచ్చరించారు. ఆరు హామీల్లో మొదటిది- తమ ప్రభుత్వం రాష్ట్రంలో నెలకొన్న భయానక వాతావరణాన్ని నిర్మూలిస్తుందని మోదీ చెప్పారు. చట్టంపై విశ్వాసం, బాధితులకు సత్వర న్యాయం, న్యాయ వ్యవస్థపై విశ్వాసాన్ని పునరుద్ధరిస్తామని అన్నారు.తమ ప్రభుత్వ హయాంలో, పాలనా యంత్రాంగం ప్రజలకు జవాబుదారీగా, పూర్తిగా బాధ్యతాయుతంగా ఉంటుందని మోదీ పేర్కొన్నారు. తృణమూల్ మాదిరి కాకుండా పారదర్శక పరిపాలన అందిస్తామని, బెంగాల్ ప్రజలకు ఇప్పుడు ఇదే తక్షణ అవసరమని అన్నారు. ప్రతి రాజ్యాంగా వ్యవస్థ కూడా జవాబుదారీతనంగా వ్యవహరించేలా చూస్తామని హామీ ఇచ్చారాయన. ప్రతి కుంభకోణం, అవినీతి, ఆడబిడ్డలపై అన్యాయం, అత్యాచార కేసుల ఫైళ్లన్నింటినీ కూడా తిరిగి తెరుస్తామనే మూడో హామీ ఇస్తోన్నానని మోదీ స్పష్టం చేశారు. తృణమూల్ పాలనలో అవినీతికి పాల్పడిన వారందరూ జైలుకు వెళ్తారని, మంత్రి అయినా, వాచ్‌మెన్ అయినా, చట్టం అందరినీ బాధ్యులను చేస్తుందని తేల్చి చెప్పారు. ఏ తృణమూల్ గూండా కూడా చట్టం నుండి తప్పించుకోలేడనే హామీ ఇస్తున్నానని మోదీ తెలిపారు. శరణార్థులకు రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రతి హక్కు, అధికారం కల్పిస్తామని అయిదో హామీగా ప్రకటించారు మోదీ. చొరబాటుదారులను దేశం నుంచి వెళ్లగొడతామని, దేశంలో ఉండటానికి వారికి ఎప్పటికీ అనుమతించబోమని అన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రస్థాయిలో ఏడోవ వేతన సంఘాన్ని అమలు చేస్తామని, ప్రతి ఉద్యోగికీ దాని ఫలాలు అందేలా చేస్తామని చెప్పారు. ఇది తానిచ్చే ఆరో గ్యారెంటీ అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రధాని, ముఖ్యమంత్రి కలిసి పనిచేయడం అత్యవసరమని పేర్కొన్నారు.

# పదో తరగతి ఫలితాల విడుదల పై తాజా నిర్ణయం..!!

- మే మొదటి వారంలో ఫలితాల వెల్లడి



**హైదరాబాద్, ఏప్రిల్ 09 :** పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు బిగ్ అప్డేట్. పరీక్షా ఫలితాల వెల్లడి పైన స్పష్టత వస్తోంది. ప్రస్తుతం పరీక్షల మూల్యాంకనం మొదలైంది. కాగా, స్పాట్ వాల్యూయేషన్‌లో ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు చుక్కలు చూపిస్తున్నాయి. సాంకేతిక సమస్యలతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో.. రోజుకు 40 పేపర్లు దిద్దాల్సిన టీచర్లు 20 పత్రాలకు పరిమితం అవుతున్నారు. కాగా.. ఫలితాల వెల్లడి పైన అధికారులు నిర్ణయానికి వచ్చారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి స్థాయిలో సిద్ధమైన తరువాతనే ఫలితాలు వెల్లడించనున్నారు. పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ వేళ సాంకేతిక లోపం, నెట్ వర్క్ పనిచేయకపోవడం, సర్వర్ డౌన్, ట్యాబ్‌లు సజావుగా పనిచేయక పోవడం వంటి సాంకేతిక కారణాలతో మార్కుల నమోదులో తీవ్ర జాప్యం నెలకొంది. విధుల్లో పాల్గొనే టీచర్లు ఒక్కొక్కరు కనీసం 40 జవాబు పత్రాలు మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. ప్రతి జవాబు పత్రాన్ని స్కానింగ్ చేసి, మార్కులు నమోదు చేయాలి. అసిస్టెంట్ ఎగ్జామినర్లు పేపర్లు మూల్యాంకనం చేసిన అనంతరం మార్కులను ట్యాబ్‌ల ప్రక్రియకు ప్రత్యేకంగా కేటాయించిన స్పెషల్ అసిస్టెంట్లు మాత్రమే నమోదు చేయాలి. వాల్యూయేషన్ సెంటర్లలో అందుబాటులో ఉంచిన ట్యాబ్‌లు, ఇంటర్నెట్ పనిచేయడం లేదని టీచర్లు తలలు పట్టుకుంటున్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు మార్చి 16 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు జరిగాయి. దాదాపు 6.20 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాశారు. ఏప్రిల్ 16లోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కాగా, మూల్యాంకనం విధులకు దాదాపు 20 వేల మందిని ఆటోమేషన్ ద్వారా నియమించారు. అయితే విద్యాశాఖ నుంచి చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్ విధులు కేటాయించినా కొందరు ఎగ్జామినర్లు డుమ్మాకొడుతున్నారు. స్పాట్‌లో టీచర్ల కొరత తీవ్రతరం కావడం విద్యాశాఖ స్పందించింది. స్పాట్ విధులకు హాజరుకాని టీచర్లపై సస్పెన్షన్ వేటు తప్పదని అధికారులు హెచ్చరించారు. స్పాట్ సెంటర్‌లలో ఏర్పడిన సాంకేతిక సమస్యను టెలికం అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇవన్నీ పదో తరగతి ఫలితాలపై తీవ్ర ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది. తొలుత ఏప్రిల్ 4వ వారంలో ఫలితాలు వెల్లడించాలని భావించినప్పటికీ మే మొదటి వారంలో పదో తరగతి ఫలితాలు విడుదల చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. వచ్చే వారం ఫలితాల తేదీ పైన స్పష్టత రానుంది.

## వీరి రేషన్ కార్డులు రద్దు,

(మొదటిపేజీ తరువాయి)




పాన్ కార్డు, జీఎస్టీ నెంబర్లను రేషన్ కార్డు డేటాతో లింక్ చేశారు. దీంతో నగరంలో దాదాపు 2 లక్షల మంది ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లిస్తూ రేషన్ కార్డు పొందుతున్నట్లు వెల్లడైంది. ప్రభుత్వ ఉద్యోగుల కార్డులు, ఐటీ చెల్లింపుదారులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో గుర్తించారు. అనంతరం అనర్హుల డేటా బయటకు వచ్చింది. దాదాపు 80 శాతం వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తవ్వగా.. త్వరలో మిగతా విచారణ పూర్తి చేయనున్నారు.అనర్హులుగా గుర్తించిన వారికి రేషన్ నిలిపివేసారు. అదే విధంగా ఆదాయపు పన్ను చెల్లించే వారికి రేషన్ కార్డులను రద్దు చేయాలని కేంద్రం డిసైడ్ అయింది. ఫిర్యాదుల వచ్చిన వారి వివరాలను ఆధార్, పాన్ వివరాలను ఇన్‌కమ్ ట్యాక్స్ డేటా సాయంతో పరిశీలిస్తోంది. అనంతరం వారి ఆర్థిక స్తోమతను అంచనా వేసి కార్డుల తొలగింపు ప్రక్రియ చేపడుతున్నారు. ఇక ఖరీదైన వాహనాలు కలిగి ఉన్నవారిని కూడా లబ్దిదారుల జాబితా నుంచి తొలగిస్తున్నారు. ఇక మరణించిన వ్యక్తుల పేర్లపై ఉన్న కార్డులను కూడా తొలగించే ప్రక్రియ ప్రారంభించారు. ఇక పీఎం కిసాన్ డేటా ప్రకారం 52 వేల మందికిపైగా ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లిస్తున్నట్లు గుర్తించారు. రేషన్ కార్డులకు పట్టణాల్లో రూ.2 లక్షలు, గ్రామాల్లో రూ.1.50 లక్షల్లోపు వార్షిక ఆదాయం ఉన్నవారు అర్హులుగా నిర్ధారించారు. దీంతో, అర్హతలకు విరుద్ధంగా కార్డు పొందిన వారిని గుర్తించి.. వారి కార్డులు రద్దు చేసే విధంగా వేగంగా అడుగులు పడుతున్నాయి.

## ఊపిరి పీల్చుకున్న ఉద్యోగులు, అసలేం జరిగింది?




**హైదరాబాద్, ఏప్రిల్ 09 :** ప్రపంచ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ మరోసారి భారీగా ఉద్యోగులను తొలగించబోతోందన్న వార్తలు ఇటీవల ఐటీ రంగంలో కలకలం రేపాయి. ముఖ్యంగా 2026 మే నెలలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ూాబొ), రిటైల్ మరియు హ్యూమన్ రిసోర్సెస్ (HR) విభాగాల్లో దాదాపు 14,000 మందిని ఇంటికి పంపనున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే, ఈ నివేదికలు పూర్తిగా వాస్తవ విరుద్ధమని, ఇందులో ఎటువంటి నిజం లేదని అమెజాన్ ప్రతినిధి ఒకరు స్పష్టం చేశారు. ఉద్యోగులు తమ అభిప్రాయాలను పంచుకునే ‘బ్లైండ్’ (దీశ్రీఅఅం) అనే ఫోరమ్‌లో ఒక యూజర్ పెట్టిన పోస్ట్ ఈ వార్తలకు ఆజ్యం పోసింది. చైనాకు చెందిన ఒక టెక్ పోర్టల్ ఈ వార్తను ప్రముఖంగా ప్రచురించింది. ముఖ్యంగా వైట్ కాలర్ ఉద్యోగులు (ూ5 నుంచి ూ7 స్థాయి వారు) ఈ కోతలకు గురవుతారని, చైనాలోని కొన్ని బృందాలపై దీని ప్రభావం ఉంటుందని ఆ నివేదిక పేర్కొంది. అయితే గోదాముల్లో పనిచేసే సిబ్బందికి, లాజిస్టిక్స్ విభాగానికి ఎటువంటి ముప్పు లేదని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో డిమాండ్‌కు అనుగుణంగా భారీగా నియామకాలు చేపట్టిన అమెజాన్, గత మూడేళ్లుగా ఆపరేషన్లను క్రమబద్ధీ కరించే పనిలో ఉంది. 2025 జూన్‌లో సీఈఓ ఆండీ జస్సీ పంపిన ఒక మెమోలో, “నేడు జరుగుతున్న కొన్ని పనులను చేయడానికి భవిష్యత్తులో మాకు తక్కువ మంది వ్యక్తులు అవసరం అవుతారు” అని పేర్కొన్నారు. ఇది కాకుండా, కృత్రిమ మేధ (AI) వాడకం పెరగడం వల్ల కూడా కొన్ని ఉద్యోగాల్లో కోతలు ఉండవచ్చని గతంలో అంచనాలు వెలువడ్డాయి.

## హోటల్ మేనేజ్మెంట్‌లో ఆన్ లైన్ శిక్షణ, ఉద్యోగాలు-



**హైదరాబాద్, ఏప్రిల్ 09 :** ఉపాధి.. ఉద్యోగాల కోసం వేచి చూస్తున్న వారికి నేషనల్ స్కిల్ అకాడమీ బిగ్ అప్డేట్. హోటల్ మేనేజ్మెంట్, క్లౌడ్ కిచెన్ ఱ క్యాటరింగ్ సర్వీసెస్ కోర్సుల్లో శిక్షణ ద్వారా ఉద్యోగాల పైన కీలక ప్రకటన చేసింది. స్వయం ఉపాధి ద్వారా భవిష్యత్ నిర్మించుకునే అవకాశం కల్పిస్తోంది. ఇప్పటి వరకు ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ లో శిక్షణ ఇచ్చిన ఈ సంస్థ ఇప్పుడు కొత్తగా హోటల్ రంగంలో మహిళలు, యువతీ యువకుల నుంచి ఆన్ లైన్ లో దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. నేషనల్ స్కిల్ అకాడమీ ఫర్ హోటల్ మేనేజ్మెంట్ ఱ క్యాటరింగ్ సర్వీసెస్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో మహిళలకు, యువతీ యువకులకు హోటల్ మేనేజ్మెంట్, క్లౌడ్ కిచెన్, క్యాటరింగ్ సర్వీసెస్ లో ఆన్లైన్ /ఆఫ్లైన్ శిక్షణ ఇవ్వనుంది. శిక్షణతో పాటుగా స్వయం ఉపాధి తో పాటు ఉద్యోగ అవకాశాలు పెంపొందించేందుకు అర్హత ఆసక్తి గల మహిళలు, యువతీ యువకుల నుంచి ఆన్లైన్ లో దరఖాస్తులు ఆహ్వానించింది. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చేసిన మహిళలు, యువతీ యువకులు ఈ శిక్షణ కు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేసారు. మాస్టర్ చెఫ్, క్యాటరింగ్ సర్వీస్, క్లౌడ్ కిచెన్ సర్వీస్, క్లౌడ్ బేకరీ సర్వీస్, క్లౌడ్ బేవరేజ్ సర్వీస్, టీ-మాస్టర్, టిఫిన్-మాస్టర్, పిజ్జా-మాస్టర్, కేటరింగ్ మాస్టర్, చైనీస్ ఫుడ్ మాస్టర్, తో పాటు హోటల్ మేనేజ్మెంట్, హౌస్ కీపింగ్ సర్వీస్ వంటి వాటిల్లో శిక్షణ ఇవ్వనున్నారు.అదే విధంగా ఫ్రంట్ ఆఫీస్ మేనేజ్మెంట్, బేవరేజ్ సర్వీస్, చైనీస్ ఫుడ్ మాస్టర్ వంటి కోర్సుల్లో ఆన్లైన్ / ఆఫ్ లైన్ శిక్షణ తో పాటు ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పొందిన వారికి పరీక్షలు నిర్వహించి కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆమోదిత సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు. శిక్షణ పొందిన మహిళ లు, యువతీ యువకులు ఇంటి వద్దనుండి క్లౌడ్ కిచెన్ లో బిజినెస్ ని మొదలు పెట్టే అవకాశం హాస్పిటాలిటీ రంగంలో ఉద్యోగాలు పొందవచ్చు. హైదరాబాద్ లో ఇంటర్న్షిప్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కలవు. అర్హత ఆసక్తి గల మహిళలు, యువతీ యువకులు పూర్తి వివరాల కోసం ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఱఱఱ.అఆఅశీఱఖశ్రీంఎఱశ్రీశ్రీఖఱ్ఱఎవ-ఎ.ఱఅ ద్వారా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు.

## ఐటీ కంపెనీలో లైంగిక వేధింపులు



అణచివేశారనే ఆరోపణలపై పోలీసులు ఆ హెచ్ఆర్ ఉద్యోగిని కూడా అరెస్టు చేశారు. కాగా, అరెస్టు చేసిన పురుష నిందితులను ఆసిఫ్ అన్సారీ, షఫీ షేక్, షారుక్ ఖురేషీ, రజా మెమోన్, తౌఫిక్ అత్తార్‌లుగా గుర్తించారు. బాధితులపై గత 2-3 ఏళ్లుగా లైంగిక వేధింపుల ఘటనలు జరుగుతున్నట్లు తెలుస్తోందని పోలీసులు చెబుతున్నారు. తమపై అనుచిత శారీరక వేధింపులు జరిగాయని, తమ శరీరం, దుస్తుల గురించి అభ్యంతర వ్యాఖ్యలు చేసేవారని, అదేవిధంగా తమ మతాన్ని లక్ష్యంగా చేసుకొని పదేపదే దూషించే వారని బాధితులు వారి ఫిర్యాదుల్లో పేర్కొన్నారు.



# జిల్లాలో పకడ్బందీగా 'అరైవ్ అలైవ్' కార్యక్రమం

- **రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయ చర్యలు: కలెక్టర్ హరిచందన దాసరిలిలి**

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక'లో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ఈ నెల 13 నుంచి 18 వరకు 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆమె, రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం తగ్గించడం అందరి బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ ఆరు రోజుల ప్రత్యేక కార్యక్రమంలో రవాణా, విద్యా, పోలీస్, వైద్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించిన కలెక్టర్, గ్రామ స్థాయి రోడ్డు భద్రత కమిటీలను బలోపేతం చేసి ప్రజలకు భద్రతా నియమాలపై విస్తృత అవగాహన కల్పించాలని చెప్పారు. పాఠశాలల్లో 'చిల్డ్రన్ రోడ్ సేఫ్టీ డే' నిర్వహించి విద్యార్థుల్లో భద్రతా చైతన్యం పెంపొందించాలన్నారు.

**గోల్డెన్ అవర్‌కు ప్రాధాన్యం**

ప్రమాదం జరిగిన వెంటనే ప్రాణాలను కాపాడేందుకు అత్యంత కీలకమైన 'గోల్డెన్ అవర్'లో స్పందించేలా మెడికల్ శాఖ ద్వారా అత్యవసర శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారికి జరిమానాలతో పాటు కౌన్సెలింగ్ ఇచ్చి వారి ప్రవర్తనలో మార్పు తీసుకురావాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు స్వయంగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని, ఈ కార్యక్రమం కేవలం వారాంతంతో ముగియకుండా ప్రజల జీవనశైలిలో భాగం కావాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, రవాణా శాఖ జాయింట్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ సి. రమేష్, డీఈవో రోహిణి, డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ వెంకటి, ఆర్టీసీ ఆర్ఎం సుధా పరిమళ, ఆర్టీవోలు పురుషోత్తం రెడ్డి, కిష్టయ్య, యర్రి స్వామి, అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర అభివృద్ధికి కట్టుబడున్న ప్రభుత్వం

- **మంత్రి పొన్నం ప్రభాకర్**
- **'సమతా కిచెన్' ప్రారంభం**

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలోని ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వికలాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం, వారికి ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ 'ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన 'సమతా కిచెన్'ను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అన్ని వర్గాల అభివృద్ధి సాధించినప్పుడే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా వికలాంగులు, ట్రాన్స్‌జెండర్లకు కేవలం సంక్షేమ పథకాలు అందించడం మాత్రమే కాకుండా, వారిని ఆర్థిక కార్యకలాపాల్లో భాగస్వాములను చేయడం ద్వారానే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. 'సమతా కిచెన్' ద్వారా వారికి ఉపాధి కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు.

**లబ్ధిదారులకు ఆర్థిక చేయూత**

కార్యక్రమంలో భాగంగా ఆరుగురు ట్రాన్స్‌జెండర్ లబ్ధిదారులకు ఆర్థిక పునరావాస పథకం కింద ఒక్కొక్కరికి రూ.75,000 చొప్పున చెక్కులను మంత్రి అందజేశారు. అలాగే ఐదుగురు వికలాంగులకు రూ.1,18,500 విలువైన బ్యాటరీ ఆధారిత వీల్‌చైర్లను పంపిణీ చేశారు. ప్రస్తుతం 'సమతా కిచెన్'లో ఆరుగురు ట్రాన్స్‌జెండర్లు, ఒక వికలాంగుడికి ఉపాధి కల్పించడంపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు.

**ప్రభుత్వ గణాంకాలు -- సంక్షేమ చర్యలు**

రాష్ట్రంలో వికలాంగులు, వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం



ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి వివరించారు. హైదరాబాద్ జిల్లాలో సుమారు 2 లక్షల మంది వృద్ధులు ఉన్నారని, అర్హులైన వారందరికీ పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 50 వేలకు పైగా సదరం సర్టిఫికెట్లు, 5 వేల యూడీఐడీ కార్డులు జారీ చేసినట్లు వెల్లడించారు. అలాగే 29,902 మంది వికలాంగులకు పింఛన్లు అందుతున్నాయని, 404 మంది ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు పత్రాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లు గౌరవప్రదమైన జీవితం గడపాలని, ఈ కిచెన్‌కు ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ వాలంటీర్లుగా నియమించడం మంచి నిర్ణయమని, భవిష్యత్తులో వారికి రాజకీయ, పరిపాలనా రంగాల్లో ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి మాట్లాడుతూ వికలాంగులు, ట్రాన్స్‌జెండర్లకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి, శాశ్వత ఉపాధి కల్పించడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలానికి ముందే నాలాల డీసిల్టింగ్ పూర్తి చేయాలి

- **హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్**
- **వరదలు నివారించేందుకు అధికారులకు కీలక సూచనలు**

**బలగం టీవి, హైదరాబాద్**

వర్షాకాలంలో నగరాన్ని వరదలు ముంచెత్తకుండా నివారించాలంటే నాలాలు, వరద కాలువల్లో పేరుకుపోయిన పూడికను పూర్తిస్థాయిలో తొలగించాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. నగరంలో జరుగుతున్న డీసిల్టింగ్ పనులను గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

రహ్మత్‌నగర్, కృష్ణానగర్, అమీర్‌పేట, గాయత్రినగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్ స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వర్షాకాలంలో ఎక్కడ ఇబ్బందులు తలెత్తుతున్నాయి, వాటి కారణాలు ఏమిటి అనే అంశాలపై చర్చించి అధికారులకు తగిన సూచనలు చేశారు.

నాలాల్లో పూడిక తొలగింపునకు ఎక్కడైనా ఇళ్ల వాకిళ్లు అడ్డంకిగా ఉన్నా, అవసరమైతే వెంటనే చర్యలు తీసుకుని పనులు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. వేసవికాలమే డీసిల్టింగ్ పనులకు అనుకూల సమయం కావడంతో ఈ సమయంలోనే పూర్తి చేయాలని సూచించారు.

**వాట్సాప్ గ్రూపుల ద్వారా పర్యవేక్షణ**

డివిజన్ వారీగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి డీసిల్టింగ్ పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని



కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులను కోరారు. స్థానికుల సూచనలు సమస్యల పరిష్కారానికి దోహదపడతాయని తెలిపారు.

రహ్మత్‌నగర్ వంతెన వద్ద పెద్దఎత్తున పూడిక తొలగింపు పనులను పరిశీలించిన ఆయన, కృష్ణానగర్‌లో వేసవిలోనే మురుగు రహదారులపైకి రావడాన్ని గమనించారు. ప్రతి 100 మీటర్లకు పనుల పురోగతిపై స్పష్టత ఉండాలని సూచించారు.

డీసిల్టింగ్ పనుల్లో ఎక్కడైనా సమస్యలు తలెత్తినా లేదా యంత్రాలు అవసరమైనా వెంటనే తెలియజేయాలని జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులకు ఆదేశించారు. డీఆర్ఎఫ్ సిబ్బంది పూర్తి సహకారం అందిస్తారని పేర్కొన్నారు.

# షేక్‌పేట్--మాసాబ్‌ట్యాంక్ మార్గం మోడల్ కారిడార్‌గా అభివృద్ధి

- **ట్రాఫిక్ సమస్యల నివారణకు క్షేత్రస్థాయిలో పరిశీలన**

**బలగం టీవి, హైదరాబాద్**

నగరంలోని కీలకమైన షేక్‌పేట్ ఫ్లైఓవర్ నుంచి మాసాబ్‌ట్యాంక్ వరకు ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించి ఈ మార్గాన్ని 'మోడల్ కారిడార్'గా అభివృద్ధి చేయడానికి అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ సహా ఉన్నతాధికారుల బృందం గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించింది. అధికారులంతా ఒకే బస్సులో ప్రయాణిస్తూ మార్గమధ్యంలోని ట్రాఫిక్ అడ్డంకులు (బాటిల్ నెక్‌లు), నీరు నిలిచే ప్రాంతాలు, ఆక్రమణలను పరిశీలించి తక్షణ పరిష్కార మార్గాలను సూచించారు.

**పాదచారుల భద్రతకు ప్రాధాన్యం**

ఎస్‌డీఐ హాస్పిటల్, బృందావన్ కాలనీ రోడ్ నెం.1 వద్ద కొత్త ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని నిర్ణయించారు. షేక్‌పేట్ నాలా వద్ద పెలికాన్ సిగ్నల్, జీబ్రా క్రాసింగ్‌లు ఏర్పాటు చేయనున్నారు.

**జంక్షన్ల పునర్నిర్మాణం**

నానల్‌నగర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు రోటరీ వెడల్పును తగ్గించి రహదారి విస్తరణ చేపట్టాలని ఆదేశించారు.

**రోడ్డు విస్తరణకు చర్యలు**

రేతిబౌలి నుంచి నానల్‌నగర్ వరకు సెంట్రల్ మీడియన్, అడ్డంగా ఉన్న చెట్లను తొలగించి రోడ్డును విస్తరించనున్నారు. ఎన్ఎండీసీ, డెల్ స్టోర్ ప్రాంతాల్లో మాస్టర్ ప్లాన్ ప్రకారం భూసేకరణ చేపట్టనున్నారు.

రహదారి మధ్యలో ఉన్న రామాలయం ఆర్చ్, బొడ్డురాయి, షేక్‌పేట్ నాలా సమీపంలోని సమాధులను తొలగించి వాహన రాకపోకలకు మార్గం సుగమం చేయాలని నిర్ణయించారు. మాసాబ్‌ట్యాంక్ ఫ్లైఓవర్ వద్ద ఎత్తు పరిమితి బారియర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయనున్నారు.

మెహదీపట్నం వైపు ఉన్న ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించి, పోచమ్మ బస్తీ నుంచి రోడ్ నెం.12కు స్లిప్ రోడ్డును అభివృద్ధి చేయనున్నారు.

ఈ సందర్భంగా సీపీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా తక్షణ, దీర్ఘకాలిక చర్యలను గుర్తించినట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ మాట్లాడుతూ నగర ట్రాఫిక్ అభివృద్ధి పనుల కోసం ప్రతి జోన్‌కు రూ.20 కోట్ల చొప్పున మొత్తం రూ.120 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. కేబీఆర్ పార్క్ వద్ద పెండింగ్ పనులను రెండేళ్లలో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్, జీహెచ్ఎంసీ మరియు ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వికలాంగుల సంక్షేమానికి ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయాలి

- **ఎన్‌పీఆర్‌డీ డిమాండ్**



**బలగం టీవి, మోత్కూర్**

వికలాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేంద్ర డిమాండ్ చేశారు. గురువారం మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో ఎన్‌పీఆర్‌డీ టౌన్ కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వనం ఉపేంద్ర మాట్లాడుతూ... ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేకంగా కొనసాగిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఇప్పటికీ శిశు సంక్షేమ శాఖలోనే కొనసాగిస్తున్నారని విమర్శించారు. దీనివల్ల వికలాంగుల కోసం కేటాయించే బడ్జెట్‌పై స్పష్టత లేకుండా పోయిందన్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న పెన్షన్ బకాయిలను వెంటనే చెల్లించాలని, వికలాంగులకు అవసరమైన పరికరాల పంపిణీ కూడా ఆలస్యమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు దఫాలుగా దరఖాస్తులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎవరికి పరికరాలు అందలేదని తెలిపారు. వికలాంగులకు ఉపాధి అవకాశాల కోసం రుణాలు ఇస్తామని చెప్పినా, బ్యాంకుల ద్వారా రుణాల మంజూరు జరగడం లేదని విమర్శించారు. ఎలాంటి షరతులు లేకుండా ప్రతి వికలాంగుడికి రూ.10 లక్షల రుణం అందించాలని డిమాండ్ చేశారు.

అలాగే ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన రూ.6,000 పెన్షన్‌ను తక్షణమే అమలు చేయాలని, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని, అంత్యోదయ రేషన్ కార్డుల ద్వారా 35 కిలోల బియ్యం ఇవ్వాలని కోరారు. గ్రామపంచాయతీ నుంచి అసెంబ్లీ, పార్లమెంట్ వరకు నామినేటెడ్ పోస్టుల్లో వికలాంగులకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎన్‌పీఆర్‌డీ నాయకులు గడ్డం యాదగిరి, ఎర్రవెల్లి నాగేష్, గౌలికర్ రాజు, గుండు శ్రీనివాస్, అప్పల యాదగిరి, వెంకటేష్, మంజుల తదితరులు పాల్గొన్నారు.



# ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి

- **ప్రముఖ డెంటల్ డాక్టర్ జీఎన్ రావు**
- **రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ**

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రజానాట్యమండలి రాష్ట్ర 3వ మహాసభలు జయప్రదం చేయాలని ప్రముఖ డెంటల్ డాక్టర్ జీఎన్ రావు పిలుపునిచ్చారు. గురువారం ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళ కల కోసం కాదు.. కళ ప్రజల కోసం.. కళ ప్రగతి కోసం అనే నినాదంతో ఏర్పడ్డ ప్రజానాట్యమండలి గత 80 సంవత్సరాలుగా ప్రజల కోసం తమ ఆట మాట అంకితం చేస్తూ క్రమశిక్షణతో ప్రజల పక్షాన నిలబడుతోందని తెలిపారు. పాలకులు ప్రజా సమస్యలను విస్మరించిన ప్రతి సందర్భంలో ప్రజలను చైతన్యవంతం చేస్తూ, ప్రజల మధ్య ఉండి ప్రజా కళాకారులను తీర్చిదిద్దడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. మహాసభలు విజయవంతంగా జరగాలని, ప్రజా కళాకారులు, ప్రజావాగ్గేయకారులు, కవులు, రచయితలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ నెల 15, 16, 17 తేదీలలో రవీంద్రభారతిలో నిర్వహించనున్న ఈ మహాసభలకు రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 600 మంది ప్రజా, జానపద కళాకారులు హాజరవుతారని తెలిపారు. జానపద కళారూపాలను కాపాడడంలో ప్రజానాట్యమండలి ముందుంటుందన్నారు. జానపదాలు కనుమరుగవుతున్న తరుణంలో ప్రజానాట్యమండలి ఈ కార్యక్రమం నిర్వహించడం చాలా మంచి నిర్ణయమన్నారు ఈ కార్యక్రమంలో మహాసభల ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి మారన్న, రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ, సహాయ కార్యదర్శి వినోద్, గోవర్ధన్, నగర కమిటీ సభ్యులు రాము, నగర నాయకులు పి. పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.




# గ్రామాల అభివృద్ధికి కేంద్ర నిధులే కీలకం

- **ఎంపీ డీకే అరుణ**

**బలగం టీవి, ఊట్కూర్**

పట్టణాలకు దీటుగా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు విస్తృతంగా వివరించాలని ఆమె పిలుపునిచ్చారు. గురువారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం పెద్దజట్రంలో ఎంపీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమెకు బీజేపీ శ్రేణులు, స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు.

పెద్దజట్రం సర్పంచ్ వాకిటి వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడిన ఎంపీ డీకే అరుణ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోనే గ్రామీణాభివృద్ధి వేగవంతమైందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. వేసవికాలంలో ప్రజలు ఇబ్బంది పడకుండా మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తున్నట్లు గుర్తుచేశారు. గ్రామాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని, ప్రతి పల్లెను అభివృద్ధి చేసేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. బీజేపీ సర్పంచ్‌లు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

అనంతరం పెద్దజట్రం నుంచి లక్ష్మీపల్లి వరకు లింక్ రోడ్డు, పల్లె దవాఖాన, అంగన్వాడి భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామ ప్రజలు వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన ఎంపీ, లింక్ రోడ్డు, పల్లె దవాఖాన, అంగన్వాడి భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట మున్సిపల్ చైర్‌పర్సన్ కొండా శ్వేత సత్య యాదవ్, బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

# ఐదు రోజుల లాభాలకు బ్రేక్

**నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు**

**బలగం టీవి, హైదరాబాద్**

దేశీయ స్టాక్ మార్కెట్లలో ఐదు రోజులుగా కొనసాగుతున్న లాభాల పరంపరకు గురువారం అడ్డుకట్ట పడింది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరగడం, అమెరికా--ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంపై అనిశ్చితి నెలకొనడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను ప్రభావితం చేశాయి. దీంతో మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. రోజంతా అమ్మకాల ఒత్తిడి కొనసాగడంతో సెన్సెక్స్ 931.25 పాయింట్లు పడిపోయి 76,631.65 వద్ద ముగిసింది. నిఫ్టీ 222.25 పాయింట్లు నష్టపోయి 23,775.10 వద్ద స్థిరపడింది.

ప్రధానంగా జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, లార్సెన్ అండ్ టుబ్రో వంటి షేర్లు నష్టాల్లో ముగిశాయి. ముఖ్య సూచీలు బలహీనపడినప్పటికీ బ్రాడర్ మార్కెట్లు మాత్రం కొంత స్థిరంగా నిలిచాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.25 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 0.20 శాతం లాభాలతో ముగిశాయి.

రంగాల వారీగా చూస్తే బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు ఎక్కువగా నమోదయ్యాయి. అమెరికాపై అవిశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బఘేర్ ఘలీబాఫ్ చేసిన వ్యాఖ్యలు మార్కెట్లలో ఆందోళనకు దారితీశాయి. కాల్పుల విరమణ ఒప్పందాలను అమెరికా ఉల్లంఘిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ పరిణామాల ప్రభావంతో రూపాయి కూడా బలహీనపడింది. ఐదు రోజులుగా కొనసాగుతున్న రూపాయి ర్యాలీకి కూడా బ్రేక్ పడింది.

# స్టాక్ మార్కెట్ పేరుతో భారీ సైబర్ మోసం

- **పూణెలో వైద్యుడికి రూ.12 కోట్ల టోకరా**

**బలగం టీవి, హైదరాబాద్**

మహారాష్ట్రలో సైబర్ మోసగాళ్లు మరోసారి రెచ్చిపోయారు. పూణెకు చెందిన 75 ఏళ్ల వైద్యుడిని స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో మోసం చేసి సుమారు రూ.12 కోట్లకు పైగా దోచుకున్నారు.

పోలీసుల వివరాల ప్రకారం... బాధితుడికి గుర్తుతెలియని నంబర్ నుంచి వచ్చిన సందేశం ద్వారా ఈ మోసం ప్రారంభమైంది. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే కేవలం 11 రోజుల్లోనే డబ్బు రెట్టింపు అవుతుందని నమ్మబలికారు. అంతేకాకుండా భారీగా లాభాలు వస్తాయని చెప్పి ఆకర్షించారు. 'వీఐపీ స్టాక్ 24' పేరుతో ఉన్న వాట్సాప్ గ్రూపులో చేర్చిన నిందితులు, ఆకర్షణీయమైన ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌లను చూపించి వైద్యుడిని నమ్మించారు. నకిలీ ట్రేడింగ్ యాప్ ద్వారా పెట్టుబడులు పెట్టిస్తున్నట్లు చూపిస్తూ, అధిక లాభాలు వస్తున్నట్లు మాయచేశారు.

ఈ ఏడాది మార్చి 7 నుంచి 18 వరకు బాధితుడు ఎనిమిది బ్యాంక్ ఖాతాలకు దాదాపు రూ.12.31 కోట్లను బదిలీ చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రారంభంలో లాభాలు చూపిస్తూ నమ్మకాన్ని పెంచిన నిందితులు, తరువాత మరిన్ని డబ్బులు పెట్టాలని ఒత్తిడి చేశారు. డబ్బులు పంపేందుకు నిరాకరించినప్పుడు ఆస్తులను సీజ్ చేస్తామని బెదిరించి మరింత డబ్బు బదిలీ చేయించారని పోలీసులు వెల్లడించారు. మూడు నెలల పాటు ఈ మోసం కొనసాగినట్లు తెలిసింది. చివరకు డబ్బులు తిరిగి రాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు ఆధారంగా సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సమీకరణాల కలయికతో

# ‘జిల్లా కాంగ్రెస్’ జంబో కమిటీ...



- జిల్లా కాంగ్రెస్ కొత్త కార్యవర్గం ఖరారు..
- 45 మందితో కూడిన జాబితాను విడుదల చేసిన పీసీసీ అధ్యక్షుడు
- తక్షణమే అమల్లోకి రానున్న ఉత్తర్వులు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత మార్పుల ప్రక్రియ వేగవంతమైంది. జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన కార్యవర్గాన్ని ప్రకటిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ పంపిన ప్రతిపాదనల మేరకు మొత్తం 45 మందితో కూడిన ఈ బృందాన్ని ఎంపిక చేశారు. కొత్త కార్యవర్గంలో అనుభవజ్ఞులతో పాటు చురుకైన యువ నాయకులకు చోటు కల్పించారు. మొత్తం కమిటీలో ఆరుగురు ఉపాధ్యక్షులు, 16 మంది ప్రధాన కార్యదర్శులు, ఒక కోశాధికారి, ఇద్దరు అధికార ప్రతినిధులు, 15 మంది కార్యదర్శులు మరియు ఐదుగురు ఈసీ సభ్యులు ఉన్నారు.

**నియామకమైన వారు వీరే..**

ఉపాధ్యక్షులు గా కూరగాయల కొమురయ్య, పిల్లి కనుకయ్య, కొండం రాజిరెడ్డి, పులి రాంబాబు, దత్తాత్రేయ గౌడ్, చొప్పదండి ప్రకాశ్, ?ప్రధాన కార్యదర్శులుగా వి. శ్రీనివాస్, చేపూరి గంగాధర్, గొట్టె రుక్మిణి, యెల్లె బాల్ రెడ్డి , లింగాల భూపతి, సీహెచ్.రామస్వామి, మంగ కిరణ్, ఎస్కే. ఫిరోజ్ పాషా, టి.జలపతి, వేముల దామోదర్, రాగుల జగన్, వంగ గిరిధర్ రెడ్డి, ఎస్.శ్రీనివాస్, బైరి గంగమల్లయ్య, కూతురు వెంకట్ రెడ్డి, గాదంశెట్టి బాలలక్ష్మి, కోశాధికారి రంగు వెంకటేశ్,? అధికార ప్రతినిధులు గా చిలుక రమేశ్, వైద్య శివప్రసాద్, కార్యదర్శులు గా జక్కు మోహన్, మిర్యాల్ కార్ శ్రీనివాస్, లింగంపల్లి యెల్లాగౌడ్, కడవేరుగు ప్రకాష్, పండుగ ప్రదీప్, బానోత్ రాందాస్, అరుణ్ తేజచారి, ఎదురుగట్ల వనిత, అలువాల చందు, బూత శ్రీనివాస్ గౌడ్, చొక్కాల రాము, షేక్ మోయిన మోయిజ్, మూల రామచంద్రారెడ్డి, నాగుల విష్ణు ప్రసాద్, ఈసీ మెంబర్లుగా చిందం శ్రీనివాస్, దూలం నారాయణ, మేడిపల్లి రాం రెడ్డి, ద్యావల దిలీప్, మల్యాల రాజవీరు లను ప్రకటించారు.

ప్రకటన వెలువడిన క్షణం నుంచే వీరందరూ ఆయా పదవుల్లో బాధ్యతలు చేపడతారని, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కొత్త కమిటీ ఎంపికపై జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

# ప్రభుత్వ దవాఖానాల్లోనే అన్ని పరీక్షలు నిర్వహించాలి..

- ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యంగా అవగాహన పెంచాలి..
- కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ దవాఖానల్లో రోగ నిర్ధారణ పరీక్షలు చేయాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక లో భాగంగా 99 రోజుల కార్యాచరణలో వైద్య ఆరోగ్య శాఖ ఆద్వర్యంలో వారోత్సవాలు సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో గురువారం వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ర్యాలీ అంబేద్కర్ చౌక్ నుంచి బతుకమ్మ ఘాట్ వరకు నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక లో భాగంగా అన్ని ప్రభుత్వ దవాఖానల్లో రోగ నిర్ధారణ పరీక్షలు చేయాలని, రోగులకు ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. ఇంకా మెరుగైన వైద్య సేవల కోసం కరీంనగర్ లోని ప్రభుత్వ ఆసుపత్రులకు రెఫర్ చేయాలని ఆదేశించారు. ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా ఎయిడ్స్ నియంత్రణపై అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, వేములవాడ ఏరియా ఆసుపత్రి, అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని,నిర్ధారణ పరీక్షలు చేయాలని ఆదేశించారు. ఎయిడ్స్ బాధితులకు మెరుగైన వైద్యం, మందులు అందుబాటులో ఉన్నాయని అన్నారు.




ట్రాన్స్ జెండర్స్ కోసం ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రజిత, జీ జీ హెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సబ్ స్టేషన్ నిర్మాణానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్థల పరిశీలన చేశారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం సమీపంలో నూతన సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలాలను గురువారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఎన్పీడీసీఎల్ సీఈ అశోక్ తో కలిసి పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ పరిశీలనలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, సిరిసిల్ల డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీసీ మహిళలకు సబ్ కోటా లేకుంటే

# మహిళల 33% బిల్లు అస్సలు ఆమోదయోగ్యం కాదు..

- “చలో ఢిల్లీ” పిలుపు -- అవసరమైతే పార్లమెంట్ ముట్టడిస్తాం..
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు మ్యాకల పరశురాములు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మహిళల 33% రిజర్వేషన్ బిల్లును ఈ నెల 16న జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్లా జిల్లా అధ్యక్షుడు మ్యాకల పరశురాములు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల సాధికారతకు తాము ఎల్లప్పుడూ మద్దతు ఇస్తామని, అయితే బీసీ మహిళలకు ప్రత్యేక సబ్ కోటా లేకుండా తీసుకొస్తున్న ఈ బిల్లు బీసీ సమాజానికి తీవ్రమైన అన్యాయం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(4), 46 ప్రకారం వెనుకబడిన వర్గాల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేస్తూ, బీసీ మహిళలను ఈ బిల్లులో విస్మరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.

బీసీ మహిళలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించకపోతే దేశవ్యాప్తంగా బీసీ సమాజం ఈ బిల్లును వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న బీసీ సంఘాలు, నాయకులు, విద్యార్థులు ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. “చలో ఢిల్లీ” కార్యక్రమానికి సిద్ధమవ్వాలని కోరారు. బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించని పక్షంలో ఢిల్లీలో భారీ స్థాయిలో



ఆందోళనలు, పార్లమెంట్ ముట్టడి, అలాగే దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, బీసీ మహిళలకు న్యాయం జరిగేలా మహిళల రిజర్వేషన్ బిల్లులో తగిన మార్పులు చేయాలని మ్యాకల పరశురాములు డిమాండ్ చేశారు.

# ఎదురుగట్ల జలకళ.. విప్ చొరవపై రైతుల ప్రశంసలు..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల చెరువులోకి గోదావరి జలాలు చేరుకోవడంతో రైతులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక రైతులు కలిసి గంగమ్మ తల్లికి ఘనంగా పూజలు నిర్వహించి, జలహారతి ఇచ్చారు.

ఈ సందర్భంగా రైతులు, నాయకులు మాట్లాడుతూ.. ఎదురుగట్ల చెరువుకు గోదావరి జలాలు రావడం వెనుక ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నిరంతర శ్రమ, దూరదృష్టి ఉన్నాయని అన్నారు.రైతుల సంక్షేమమే ధ్యేయంగా, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే చూపిస్తున్న చిత్తశుద్ధి వల్లనే ఈరోజు చెరువు జలకళను సంతరించుకుందని, సాగునీటి కష్టాలు తీరడంతో ఈ ప్రాంత రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఈ వేడుకలో మండలాధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, సీనియర్ నాయకులు సోయినేని కరుణాకర్, గ్రామ సర్పంచ్ కడారి సంధ్య తిరుపతి,అడిక శ్రీనివాసరెడ్డి, జైపాల్ రెడ్డి, పొన్నం మల్లేశం, నేదూరి నరసయ్య, పాలకుర్తి శంకరయ్య, రోమాల ప్రవీణ్, వంగపల్లి మల్లేశం, గంగారెడ్డి, భూమిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, ప్రకాష్, రామస్వామి, బాలయ్య, కిషన్, నాగేందర్, నాగరాజు, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు

# హోంవర్క్ చేయలేదని వాతలు వచ్చేలా కొట్టిన టీచర్..

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల:**

అక్షరాలు దిద్దించాల్సిన విద్యాలయంలో ఓ ఉపాధ్యాయురాలు రాక్షసంగా ప్రవర్తించింది. హోంవర్క్ చేయలేదన్న నెపంతో రెండో తరగతి చదువుతున్న చిన్నారిపై విచక్షణారహితంగా దాడి చేసింది. ఈ అమానుష ఘటన తంగళ్ళపల్లి మండలం జిల్లెల్లలోని విజ్ఞాన్ విద్యానికేతన్ ప్రైవేట్ పాఠశాలలో చోటుచేసుకుంది. జిల్లెల్ల గ్రామానికి చెందిన సోఫియా అనే చిన్నారి స్థానిక విజ్ఞాన్ విద్యానికేతన్ పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. కాగా, బుధవారం ఇచ్చిన హోంవర్క్ సరిగా చేయలేదని ఆగ్రహానికి గురైన ఓ ఉపాధ్యాయురాలు చిన్నారిని తీవ్రంగా చితకబాదింది. చిన్నారి శరీరంపై వాతలు తేలేలా కొట్టడంతో ఆ చిన్నారి నొప్పితో విలవిలలాడిపోయింది.పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన చిన్నారి శరీరంపై ఉన్న గాయాలను చూసి తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులే ఇలా పసిపిల్లలపై కర్కశంగా వ్యవహరించడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారిని కొట్టిన టీచర్‌పై, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.





# ప్రజా ప్రభుత్వంలో విద్య వైద్యానికి పెద్ద పీట

- జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేలా కృషి చేయాలి..
- జూన్ నుండి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు
- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ , చందుర్తి:**

ప్రజా ప్రభుత్వంలో విద్య వైద్యానికి పెద్ద పీట వేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం చందుర్తి మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 18 లక్షల 47 వేల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన నిర్వహించారు. అనంతరం 99 మంది లబ్ధిదారులకు 32 లక్షల 45 వేల విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.

## విద్యుత్ వైర్ల తొలగింపుతో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఊపిరి...

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో శాశ్వత పరిష్కారం
- కృతజ్ఞతలు తెలిపిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు బింగి రేణుక

**బలగం టీవీ, వేములవాడ:**

వేములవాడ పట్టణంలోని కోరుట్ల రోడ్ భీమేశ్వర ఫంక్షన్ హాల్ సమీపంలో ప్రమాదకరంగా వెళ్లిన విద్యుత్ వైర్లు కారణంగా ఆగిపోయిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఊరట లభించింది.. లబ్ధిదారురాలు బింగి రేణుకకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి పైనుండి విద్యుత్ లైన్ వెళ్లడంతో పనులు నిలిచిపోయాయి. సమస్య పరిష్కారం కోసం రేణుక ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన ఆది శ్రీనివాస్, టీఎస్ ఎన్పీడీసీఎల్ అధికారులతో ఫోన్లో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకునేలా ఆదేశించారు. గురువారం టీఎస్ ఎన్పీడీసీఎల్ అధికారులు ప్రమాదకర విద్యుత్ లైన్‌ను తొలగించడంతో ఇంటి నిర్మాణానికి ఉన్న అడ్డంకి తొలగిపోయింది. సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో లబ్ధిదారురాలు రేణుక ఊపిరి పీల్చుకున్నారు. సమస్యను పరిష్కరించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు, వార్డు కౌన్సిలర్ సంగీత- శ్రీకాంత్ కు బింగి రేణుక కృతజ్ఞతలు తెలిపారు..





## నూతన ప్రెస్ క్లబ్ కార్యవర్గాన్ని సన్మానించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, వేములవాడ:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణ టి యు డబ్ల్యూ జే (ఐజేయు) నూతన ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ గురువారం ఘనంగా సన్మానించారు.? ఇటీవల ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు ఆది శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలవగా, వారికి శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. సమాజ అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో పత్రికా రంగానికి ఉన్న ప్రాముఖ్యత గొప్పదని అన్నారు. నూతన కార్యవర్గం బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

# పార్టీ బలోపేతానికి కృషి చేస్తా..

- కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ గిరిధర్ రెడ్డి

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలంగా పనిచేసినందుకు జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యత ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన వంగ గిరిధర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో తనపై నమ్మకంతో మండల ఎన్ ఎస్ యు ఐ సభ్యునిగా, ఉమ్మడి కరీంనగర్ యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా, ముస్తాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా కొనసాగడం జరిగిందని పేర్కొన్నారు.. రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించినందుకు పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్‌కు, రాష్ట్ర అధికార ప్రతినిధి చీటీ ఉమేష్ రావు, మంత్రి పొన్నం ప్రభాకర్,రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్, డీసీసీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, సిరిసిల్ల నియోజక వర్గ ఇంచార్జి కేకే మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్కే సాహెబ్, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లి బలోపేతం చేయడం జరుగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటా చేరవేర్చి ప్రజలకు దగ్గరవుతామని చెప్పారు.



## ట్రాక్టర్ బోల్తా పడి యువకుడి దుర్మరణం..



- డ్రైవర్ పరిస్థితి విషమం

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

సర్వీసింగ్ చేయించుకుని తిరిగి వస్తుందనుకున్న ట్రాక్టరే ఆ ఇంటి దీపాన్ని ఆర్పేస్తుందని ఎవరూ ఊహించలేదు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ శివారులో జరిగిన ఈ ఘోర ప్రమాదం ఒక కుటుంబాన్ని కోలుకోలేని దెబ్బ తీసింది.ఈ రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరొకరు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని ఎల్లారెడ్డి కుమారుడు మనోజ్, డ్రైవర్ నితిన్‌తో కలిసి ట్రాక్టర్ సర్వీసింగ్ కోసం సిరిసిల్లకు వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి గ్రామానికి వస్తుండగా, వెంకటాపూర్ శివారులోకి రాగానే ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది.ఈ ప్రమాదంలో ట్రాక్టర్ కింద చిక్కుకుపోయిన మనోజ్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్ నితిన్‌ను గమనించిన స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎల్లారెడ్డిపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. చేతికి వచ్చిన కుమారుడు మృతి చెందడంతో నాగంపేట గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## రైతు నుంచి రూ.10 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఆర్ఐ

**బలగం టీవీ, అంతర్గాం**



రైతు నుండి రూ.10 వేల లంచం తీసుకుంటూ ఓ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఈ ఘటన గురువారం అంతర్గాం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో జరిగింది. ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, అంతర్గాం మండలం రాయదండి గ్రామానికి చెందిన వెంకటస్వామి అనే రైతు తన ఐదెకరాల భూమి ఇతరుల పేరుపై ధరణిలో నమోదు కావడంతో ఎంక్వైరీ చేయించాలని ఆర్ఐ శ్రీమాన్‌ను సంప్రదించాడు. ఈ ఎంక్వైరీ నిర్వహించేందుకు ఆర్ఐ రూ.10 వేల లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధిత రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, వారి సూచనల మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో డబ్బులు ఇస్తుండగా ఆర్ఐను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అనంతరం ఆర్ఐ శ్రీమాన్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేసిన పక్షంలో ప్రజలు వెంటనే ఏసీబీ అధికారులకు సమాచారం ఇవ్వాలని, ఫిర్యాదు దారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు.



## 14వ తేదీన అంబేద్కర్ జయంతి వేడుకలు..

- కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

ఈ నెల 14వ తేదీన భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించను న్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఈ నెల 14వ తేదీన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించనున్న సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జయంతి వేడుకల పోస్టర్లను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, హౌసింగ్ పీడీ వెంకట మాధవరావుతో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించను న్నామని తెలిపారు. జయంతి వేడుకలకు వివిధ సంఘాల ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు .

## తమిళనాడు ఎన్నికల్లో అత్యంత సంపన్న అభ్యర్థి లీమా రోజ్.

**లాల్గుడిలో ఆసక్తికర పోరు**

**బలగం టీవీ, తమిళనాడు (తిరుచ్చి):**



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు రోజురోజుకీ ఉత్కంఠ భరితంగా మారుతున్నాయి. కొత్త రాజకీయ సమీకరణాలు, యువ అభ్యర్థుల ప్రవేశం, అలాగే సినీ నటుడు విజయ్ స్థాపించిన పార్టీ రంగప్రవేశంతో ఎన్నికల పోరు మరింత రసవత్తరంగా మారింది.

ఈ నేపథ్యంలో తిరుచ్చి జిల్లా లాల్గుడి నియోజకవర్గం నుంచి అన్నా డిఎంకె పార్టీ తరపున పోటీ చేస్తున్న లీమా రోజ్ రాష్ట్రంలోనే అత్యంత సంపన్న అభ్యర్థిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆమె కుటుంబ ఆస్తుల విలువ సుమారు రూ. 5,863 కోట్లు కాగా, ఆమె వ్యక్తిగత ఆస్తులు రూ. 1,049 కోట్లు!

లీమా రోజ్ భర్త శాంటియాగో మార్టిన్ లాటరీ టికెట్ల వ్యాపారంలో ప్రముఖుడు. ఆయన పేరిట రూ. 4,100 కోట్లకు పైగా ఆస్తులు ఉన్నట్లు సమాచారం. లీమా రోజ్ వద్ద 19 కిలోల బంగారం, 1217 క్యారట్ల వజ్రాలు, 13 కిలోల వెండి, 33 గ్రాముల ప్లాటినం ఉన్నట్లు సమాచారం.. అలాగే ఆమెకు రూ. 139.63 కోట్ల చరాస్తులు, రూ. 909.94 కోట్ల స్థిరాస్తులు ఉన్నాయని వెల్లడించారు. అప్పులు కూడా రూ. 8.57 కోట్ల మేర ఉన్నట్లు తెలిపారు.

58 ఏళ్ల లీమా రోజ్ ఇటీవలే రాజకీయాల్లోకి ప్రవేశించి అన్నాడిఎంకె పార్టీలో చేరారు. పార్టీకి భారీ విరాళం అందజేసినట్లు సమాచారం. ఆసక్తికరంగా, ఆమె విద్యార్హత ఆరవ తరగతి మాత్రమే కాగా, ఆమెపై నాలుగు కేసులు కూడా నమోదై ఉన్నట్లు తెలుస్తోంది.

లాల్గుడి నియోజకవర్గంలో ఆమె గెలుపుపై చర్చలు జోరుగా సాగుతున్నాయి. అభివృద్ధి హామీలతో పాటు సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఆదరణ పొందుతున్నారు. మార్టిన్ చారిటీ ఫౌండేషన్ ద్వారా ఆమె ఎన్నో ఏళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. "నాకు అవకాశం ఇస్తే లాల్గుడిని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తాను" అని లీమా రోజ్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో ఆమెకు భారీగా యువత మద్దతు లభిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి, సంపద, సేవా కార్యక్రమాలు, రాజకీయాల్లో కొత్తగా అడుగుపెట్టడం వంటి అంశాలతో లీమా రోజ్ పోటీ లాల్గుడి నియోజకవర్గంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# అరైవ్ అలైవ్ కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలి..

- రోడ్డు ప్రమాదాల నివారణకు పక్కా చర్యలు తీసుకోవాలిలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల,**



పోలీస్ శాఖ, రవాణా శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యా శాఖ మిగతా అన్ని శాఖలు సమన్వయంతో అరైవ్ అలైవ్ కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశించారు.

ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 13 వ తేదీ నుంచి 18 వ తేదీ వరకు నిర్వహించ నున్న అరైవ్ అలైవ్ కార్యక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి వివిధ శాఖల ఉన్నాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ రోడ్డు ప్రమాదాలు మన దేశంలోనే జరుగుతు న్నాయని, ద్విచక్ర వాహన దారులు, పాదాచారులు, రోడ్డు వెంట ఉన్న వారు ఎక్కువ సంఖ్యలో మృతి చెందుతున్నారని వెల్లడించారు. ప్రజా సంక్షేమం, భద్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు అమలు చేస్తుందని అన్నారు . ఈ నెల 13వ తేదీ నుంచి 18 వ తేదీ వరకు అరైవ్ అలైవ్ కార్యక్రమాలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియమాలు అందరూ పాటించాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటించడం సామాజిక బాధ్యతని అన్నారు .

రోడ్డు ప్రమాదాల నివారణకు పక్కా చర్యలు తీసుకోవాలని, బ్లాక్ స్పాట్స్, ప్రమాద జంక్షన్లు గుర్తించాలని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్టీసీ, స్కూల్ బస్, ఆటో డ్రైవర్లకు వైద్య పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వద్ద సైన్ బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో సీటు బెల్ట్ పెట్టుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి గ్రామంలో రోడ్ సేఫ్టీ కమిటీని 8 నుంచి 9 మందితో ఏర్పాటు చేయాలని, దానిలో విరమణ పొందిన ఉద్యోగులు, మహిళలు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు ఉండేలా చూడాలని సూచించారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

**షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలి**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో జిల్లాలో షెడ్యూల్ ప్రకారం అరైవ్ అలైవ్ కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13 వ తేదీ నుంచి నిర్వహించే అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామ సభలు నిర్వహించి, రోడ్డు భద్రతా నియమాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలు ఏమైనా ఉంటే గుర్తించి, ప్రమాద రహితంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించాలని, తప్పకుండా ధరించేలా చూడాలని సూచించారు. డ్రైవర్లకు కంటి పరీక్షలు, సీపీఆర్ పై శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అటవీశాఖ అధికారి బాలమణి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ కుమార్, జిల్లా వైద్యాధికారి రజిత, జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దీన్, ఆర్టీసీ డిపో మేనేజర్లు ప్రకాశరావు, శ్రీనివాస్, ఆర్ అండ్ బీ, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు కష్టాలు తీర్చేందుకే రైతు పొలం బాట...




- ఎన్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ అశోక్

**బలగం టీవీ, తంగళ్ళపల్లి:**

రైతుల విద్యుత్ సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించడమే లక్ష్యంగా రైతు పొలం బాట కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎన్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ అశోక్ అన్నారు.గురువారం తంగళ్ళపల్లి సెక్షన్ పరిధిలోని పాపయ్యపల్లి గ్రామంలో ఎన్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ అశోక్, సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఆపరేషన్స్) బి. భిక్షపతితో కలిసి రైతు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. నేరుగా పంట పొలాల్లోకి వెళ్లి రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కార మార్గాలను సూచించారు.

ఈ సందర్భంగా ఎన్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ అశోక్ మాట్లాడుతూ రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ స్వయంగా ట్రాన్స్‌ఫార్మర్లను ముట్టుకోవడం కానీ, వైర్లు సరిచేయడం కానీ చేయకూడదని,ఏ చిన్న సమస్య ఉన్నా వెంటనే స్థానిక లైన్‌మెన్‌ను సంప్రదించాలని లేదా 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలి" అని విజ్ఞప్తి చేశారు.?నాణ్యమైన మరియు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడమే తమ లక్ష్యమని అన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ఏ ఒక్క రైతు సమస్య కూడా పరిష్కారం కాకుండా ఉండదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల డివిజనల్ ఇంజనీర్ ఎన్. అంజయ్య, ఏ.డి.ఈ గోపినాథ్, అసిస్టెంట్ ఇంజనీర్ మధుకర్, జూనియర్ ఇంజనీర్లు, లైన్‌మెన్‌లు మరియు గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

**లో వోల్టేజ్ సమస్యలకు చెక్...**

తంగళ్ళపల్లి సెక్షన్ పరిధిలోని పాపయ్యపల్లి గ్రామం, అలాగే వీర్నపల్లి మండలం మద్దిమల్ల గ్రామంలో ఏర్పాటు చేయనున్న సబ్‌స్టేషన్ల స్థలాలను ఎన్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ అశోక్, అధికారుల తో కలసి పరిశీలించారు. నిర్మాణానికి అవసరమైన సాంకేతిక అంశాలు, స్థల లభ్యతపై చర్చించారు.సిరిసిల్ల ప్రాంతంలో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి ఎన్పీడీసీఎల్ కట్టుబడి ఉంది. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే మా ప్రథమ లక్ష్యమని ఎన్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ అశోక్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఆపరేషన్స్) శ్రీ బి. బిక్షపతి, డివిజనల్ ఇంజనీర్ అంజయ్య, ఏ.డి.ఈ గోపినాథ్, అసిస్టెంట్ ఇంజనీర్ మధుకర్, సర్పంచ్ సి. హెచ్ పరశురామ్ మరియు ఇతర విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# సిరిసిల్ల కాంగ్రెస్‌లో 'పదవుల' సెగ..

- జిల్లా కార్యవర్గంలో 'ఇల్లంతకుంట' నిల్..
- ఇల్లంతకుంట నేతల ధిక్కార స్వరం..
- సామాజిక మాధ్యమాల్లో నేతల చురకలు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. జిల్లా కార్యవర్గ ప్రకటన పార్టీలో ఐక్యతను పెంచాల్సింది పోయి, నేతల మధ్య 'కస్సుబుస్సు'లకు దారితీసింది. పదేళ్ల పాటు అధికారం లేకపోయినా పార్టీ జెండాను మోసి, లాఠీ దెబ్బలు తిని, క్షేత్రస్థాయిలో పోరాడిన తమకు పదవుల విషయంలో మొండిచేయి ఎదురైందని పలువురు సీనియర్లు మండిపడుతున్నారు . ముఖ్యంగా ఇల్లంతకుంట మండల నేతలు తమ ఆవేదనను సామాజిక మాధ్యమాల వేదికగా బహిరంగంగానే వెళ్లగక్కుతున్నారు.

**ఇల్లంతకుంటకు నిల్ ..**

జిల్లా వ్యాప్తంగా సామాజిక సమీకరణాల పేరిట పదవుల పంపకం బాగానే జరిగిందని ప్రచారం జరుగుతున్నా, ఇల్లంతకుంట మండలానికి జరిగిన అన్యాయం ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశమైంది. జిల్లా కార్యవర్గంలో ఈ మండలం నుండి ఒక్కరికి కూడా చోటు దక్కకపోవడాన్ని అక్కడి నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. మేము కూడా జిల్లాలో భాగమే కదా.. కష్టకాలంలో పార్టీని కాపాడిన మా మండలాన్ని కార్యవర్గ జాబితాలో అసలు పరిగణనలోకి తీసుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటి అని స్థానిక నాయకులు నిలదీస్తున్నారు.

**నియామకాల్లో సందిగ్ధత.. పెరిగిన అసంతృప్తి**

జిల్లా కార్యవర్గంలో కొందరికి పదవులు కట్టబెట్టడం వరకు బాగానే ఉన్నా, ప్రస్తుత మండల అధ్యక్షులకు జిల్లా స్థాయి పదవులు ఇచ్చి, వారి స్థానంలో కొత్త అధ్యక్షులను నియమించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనివల్ల మండలాల్లో పార్టీ పట్టు సడలే ప్రమాదం ఉందని కేడర్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. పాతోళ్లకు తగిన గౌరవం ఇస్తూనే, నిరంతరం ప్రజల్లో ఉండే కొత్తోళ్లకు కూడా అవకాశం కల్పించడంలో అధిష్టానం విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**అధిష్టానం బుజ్జగిస్తుందా..**

పదేళ్ల తర్వాత పార్టీ అధికారంలోకి వచ్చాక కూడా తమకు గుర్తింపు దక్కకపోతే ఇంకెప్పుడు దక్కుతుందని సీనియర్లు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే సోషల్ మీడియాలో చురకలు అంటిస్తున్న నేతలు, అధిష్టానం ఈ విషయంలో పునరాలోచన చేయకపోతే తమ దారి తాము చూసుకుంటామనే సంకేతాలిస్తున్నారు. జిల్లా నాయకత్వం ఈ సెగను ఎలా చల్లారుస్తుందో, ఇల్లంతకుంట నేతల అసంతృప్తికి ఎలా ముగింపు పలుకుతుందో వేచి చూడాలి.

## జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలను 11 న ఘనంగా జరుపుకోవాలి

- ఏజిపి పసుల కృష్ణ పిలుపు

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**



మహాత్ముల జయంతి వర్ధంతి వేడుకల ను అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో జరుపుకోవడానికి ఉత్సహా కమిటీని ఏర్పాటు చేశారు , ఈనెల 11న మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా జరుపుకోవాలని కమిటీ పిలుపునిచ్చింది.

ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్ లో జరిగిన కమిటీ సమావేశంలో ఏజిపి పసుల కృష్ణ మాట్లాడుతూ అందరికి తెలిసిన మహానీయుడు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహేబ్ అంబేడ్కర్ కొందరి వాడు కాదని అందరి వాడన్నారు, ఈనెల 11వ తేదీన ఉదయం 10 :00 గంటలకు తెలంగాణ వీరనారీ చాకలి ఐల్లమ్మ విగ్రహం వద్ద మాహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలను అధికారులతో అనుమతులు తీసుకొని ఘనంగా నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది. మండల కేంద్రంలో కామారెడ్డి సిరిసిల్ల ప్రధాన రహదారిలో అక్కడక్కడ మండల కేంద్రంలో లేని మహాత్ముల విగ్రహాలను ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు, మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సాహ కమిటీ గౌరవ అధ్యక్షులుగా నంది కిషన్ ఎల్లారెడ్డిపేట సర్పంచ్ ఎలగందుల నరసింహులు మాజీ జెడ్పిటిసి సభ్యులు చిటీ లక్ష్మణ్ రావు, పందిళ్ళ లింగం గౌడ్, రొడ్డ రామచంద్రం , పెద్దూరి కిష్టయ్య , మండల కమిటీ కన్వీనర్ గా బండారి బాల్రెడ్డి, కోకన్వీనర్ గా కానాపురం లక్ష్మణ్ మాదిగ, గుర్రాల రాజిరెడ్డి, అంతేర్పుల తిరుపతి, ఎడ్ల రాజకుమార్ , దుంపెన జనార్ధన్, మెండే శ్రీనివాస్ యాదవ్, జజ్జరి దేవేందర్, వాసరవేని దేవరాజు, శివరాత్రి లక్ష్మణ్, కంచర్ల నరసింహులు, కదిరే శ్రీనివాస్ గౌడ్, కోనేటి పోచయ్య, కొత్తపల్లి ఆంజనేయులు, సూడిది రాజేందర్ , దండు శ్రీనివాసును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, కమిటీ సభ్యులు గురువారం సాయంత్రం చకాలి ఐలమ్మ విగ్రహం ఎదుట స్థల పరిశీలన చేశారు,

# ముకుల్ చౌదరి మ్యాజిక్..

- కేకేఆర్‌పై లక్నో థ్రిల్లింగ్ విజయం
- 3 వికెట్ల తేడాతో ఎల్ఎస్‌జీ గెలుపు
- కేకేఆర్‌కు భారంగా గ్రీన్ బౌలింగ్

**బలగం టీవీ, హైదరాబాద్**




ఐపీఎల్ 2026 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ (ఉా+) జోరు కొనసాగిస్తోంది. గురువారం కోల్‌కతా వేదికగా జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో 3 వికెట్ల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్ (ఖఖక్మ)పై విజయం సాధించింది. ఈ సీజన్‌లో వరుసగా రెండో విజయాన్ని అందుకుంది.

మొదట బ్యాటింగ్ చేసిన కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 181 పరుగులు చేసింది. కెప్టెన్ అజింక్య రహానే 41, అంగ్‌క్రిష్ రఘువంశీ 45 పరుగులతో రాణించారు. కామెరూన్ గ్రీన్ (32 నాటౌట్), రోవ్‌మన్ పోవెల్ (39 నాటౌట్) చివర్లో వేగంగా పరుగులు జోడించారు. లక్నో బౌలర్లలో ప్రిన్స్ యాదవ్, సిద్దార్థ్, దిగ్వేష్ రతి, ఆవేష్ ఖాన్ తలో వికెట్ తీశారు.

**ముకుల్ చౌదరి అద్భుతం**

182 పరుగుల లక్ష్య ఛేదనలో లక్నో 128 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే అనూహ్యంగా క్రీజులోకి వచ్చిన ముకుల్ చౌదరి అసాధారణ బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను తారుమారు చేశాడు. కేవలం 27 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్స్‌లతో 54 నాటౌట్‌గా నిలిచి జట్టుకు విజయం అందించాడు. ఆయుష్ బదోని కూడా 54 పరుగులతో కీలక పాత్ర పోషించాడు.

చివరి 18 బంతుల్లో 43 పరుగులు అవసరమైన సమయంలో ముకుల్ చౌదరి చెలరేగి వరుస సిక్స్‌లతో మ్యాచ్‌ను లక్నో వైపు తిప్పాడు. ముఖ్యంగా 19వ ఓవర్‌లో కామెరూన్ గ్రీన్ ఇచ్చిన 16 పరుగులు కేకేఆర్‌కు భారంగా మారాయి. చివరి ఓవర్‌లో అవసరమైన పరుగులు సాధించి లక్నో విజయం ఖాయం చేసింది.

సునాయసంగా గెలవాల్సిన మ్యాచ్‌ను కేకేఆర్ చెత్త బౌలింగ్‌తో చేజార్చుకుంది. వైభవ్ అరోరా, అనుకుల్ రాయ్ రెండేసి వికెట్లు తీసినా మిగతా బౌలర్లు ప్రభావం చూపలేకపోయారు. ముఖ్యంగా గ్రీన్ ఖరీదైన ఓవర్ మ్యాచ్‌ను పూర్తిగా తారుమారు చేసింది. రూ.25.20 కోట్ల విలువైన గ్రీన్ జట్టుకు నష్టం చేకూర్చగా, తక్కువ ధరకు వచ్చిన ముకుల్ చౌదరి అద్భుత ప్రదర్శనతో లక్నోకు చిరస్మరణీయ విజయం అందించాడు.

# ‘ఆంటీ’ అని పిలవడం వేధింపులే..

- మహిళకు రూ.1.8 లక్షల పరిహారం
- లండన్ ట్రిబ్యునల్ కీలక తీర్పు

**బలగం టీవీ, హైదరాబాద్**



పెద్దవారిని ‘ఆంటీ’, ‘అంకుల్’ అని పిలవడం సాధారణమైన విషయమే అయినప్పటికీ, అవతలి వ్యక్తికి ఇష్టం లేకపోయినా అలాగే పిలవడం వేధింపుల కిందకే వస్తుందని లండన్ ట్రిబ్యునల్ స్పష్టం చేసింది. ఈ మేరకు బాధిత మహిళకు సుమారు రూ.1.8 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది.

వివరాల్లోకి వెళ్తే, పశ్చిమ లండన్‌లోని వెస్ట్ లండన్ ఎన్‌హెచ్ఎస్ ట్రస్ట్‌లో పనిచేస్తున్న భారత సంతతికి చెందిన ఐల్డా ఎస్టేవ్స్ (61)ను, సహోద్యోగి చార్లెస్ ఒప్పాంగ్ తరచూ ‘ఆంటీ’ అని పిలుస్తుండేవాడు. అలా పిలవవద్దని పలుమార్లు చెప్పినా అతను పట్టించుకోలేదు. ఆఫీసు కారిడార్‌లో, ఇతరుల ముందూ పదే పదే ‘ఆంటీ’ అని పిలవడంతో పాటు, ఆమె వ్యక్తిగత విషయాలపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేయడం వల్ల ఎస్టేవ్స్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దీంతో ఆమె వాట్‌ఫోర్డ్ ఎంప్లాయిమెంట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. కేసు విచారణలో ఒప్పాంగ్ తన దేశ సంస్కృతి ప్రకారం పెద్దవారిని గౌరవ సూచకంగా ‘ఆంటీ’ అని పిలుస్తామని వాదించాడు. అయితే ఈ వాదనను ట్రిబ్యునల్ తిరస్కరించింది. అవతలి వ్యక్తికి ఇష్టం లేని పదంతో పదేపదే పిలవడం గౌరవంగా పరిగణించలేమని, అది వేధింపులకే చెందినదని స్పష్టం చేసింది.

జడ్జి జార్జ్ అల్లియాట్ వ్యాఖ్యానిస్తూ, ఆంటీ అనే పదం సంస్కృతిలో గౌరవార్థకమైనదైనా, వ్యక్తిగత అభిరుచిని విస్మరించడం తప్పేనని పేర్కొన్నారు. కావాలనే ఎగతాళి చేయడానికే ఇలా పిలిచినట్లు భావిస్తూ బాధితురాలి మనోభావాలు దెబ్బతిన్నాయని తేల్చారు. దీంతో చార్లెస్ ఒప్పాంగ్‌పై చర్యలు తీసుకుంటూ, 1425.15 పౌండ్లు (సుమారు రూ.1.8 లక్షలు) పరిహారంగా చెల్లించాలని ట్రిబ్యునల్ ఆదేశించింది.

# మోడీ మౌనం దేశానికే సిగ్గుచేటు

- కె. నారాయణ

**బలగం టీవీ, హైదరాబాద్**

అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై దాడులు జరుపుతున్న నేపథ్యంలో భారత్ మౌనం పాటించడం దేశానికే సిగ్గుచేటని K. Narayana తీవ్రంగా విమర్శించారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఉన్న భారత్ ఇలాంటి కీలక సమయంలో స్పందించకపోవడం బాధాకరమని అన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధాని ఛ్రితీవఅఎతీు వీశీఎఱ ప్రపంచ దేశాలు పర్యటిస్తుంటారని, కానీ యుద్ధాల్లో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న సమయంలో స్పందించకపోవడం విదేశాంగ విధానంపై ప్రశ్నలు లేవనెత్తుతోందని అన్నారు. భారత్ చేయాల్సిన పాత్రను ఇతర దేశాలు పోషిస్తున్నాయని, ఇలాంటి క్లిష్ట సమయంలో మధ్యవర్తిత్వం చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ ప్రభుత్వం ముందుకు రాకపోవడం ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. గతంలో భారత నాయకత్వానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న గౌరవాన్ని గుర్తుచేసిన ఆయన, Indira Gandhi కాలంలో భారత ప్రతిష్ఠ ఎంతో ఉన్నదని తెలిపారు. ప్రస్తుతం ఆ స్థాయి కనిపించడం లేదని, ఇది నాయకత్వ వైఫల్యమేనని విమర్శించారు. కష్టకాలంలో శాంతి చర్చలకు భారత్ ముందడుగు వేయాల్సిన సమయంలో ఆ అవకాశం కోల్పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



# డిజిటల్ పేమెంట్స్‌పై ఆర్బీఐ కొత్త ప్రతిపాదనలు




**రూ.10 వేల పైబడిన లావాదేవీలకు గంట ఆలస్యం యోచన**

**బలగం టీవీ, హైదరాబాద్**

దేశంలో పెరుగుతున్న డిజిటల్ చెల్లింపుల మోసాలను అరికట్టేందుకు క్ష్మవంవతీజవ ధీుఅని శీట క్ష్మీఅఎఖు (ఆర్బీఐ) కీలక ప్రతిపాదనలు చేసింది. రూ.10,000కు పైబడిన ఆన్‌లైన్ లావాదేవీలను ఒక గంటపాటు నిలిపివేయాలని యోచిస్తోంది. ఈ మేరకు చర్చా పత్రాన్ని విడుదల చేసి ప్రజల నుంచి అభిప్రాయాలను కోరింది.

ప్రతిపాదన ప్రకారం, ఒక ఖాతా నుంచి మరొక ఖాతాకు రూ.10 వేల కంటే ఎక్కువ మొత్తం బదిలీ చేసినప్పుడు ఆ లావాదేవీ వెంటనే పూర్తికాదు. గంటపాటు హోల్డ్‌లో ఉండి, ఈ సమయంలో పంపిన వ్యక్తికి లావాదేవీని రద్దు చేసుకునే అవకాశం ఉంటుంది. లావాదేవీ అనుమానాస్పదంగా ఉంటే బ్యాంకులు మరోసారి ధృవీకరణ కోరే అవకాశం ఉంది. అయితే వ్యాపార చెల్లింపులు, ఈ-మాండేట్లు, నాచ్ లావాదేవీలకు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రతిపాదించారు. ఆర్బీఐ గణాంకాల ప్రకారం, 2025 నాటికి దేశంలో డిజిటల్ మోసాల మొత్తం విలువ రూ.22,930 కోట్లకు చేరింది. ఇందులో సుమారు 98.5 శాతం మోసాలు రూ.10,000కు పైబడిన లావాదేవీల ద్వారానే జరుగుతున్నట్లు వెల్లడించింది. సోషల్ ఇంజినీరింగ్ ద్వారా బాధితులను మోసగాళ్లు ఒత్తిడికి గురిచేసి డబ్బు బదిలీ చేయిస్తున్న నేపథ్యంలో, ఈ గంట ఆలస్యం వారికి ఆలోచించుకునే సమయం ఇస్తుందని ఆర్బీఐ పేర్కొంది. ఇదే చర్చా పత్రంలో మరికొన్ని కీలక సూచనలు కూడా ఉన్నాయి. 70 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు రూ.50,000కు మించి చేసే లావాదేవీలకు వారు నామినేట్ చేసిన ‘విశ్వసనీయ వ్యక్తి’ ఆమోదం తప్పనిసరి చేయాలని సూచించింది. అదనంగా, ఖాతాల్లోకి వచ్చే భారీ జమలపై సమీక్ష, అవసరమైతే అన్ని డిజిటల్ చెల్లింపులను ఒకేసారి నిలిపివేసే ‘కిల్ స్విచ్’ విధానం కూడా ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలపై మే 8వ తేదీ వరకు అభిప్రాయాలు తెలియజేయాలని ఆర్బీఐ కోరింది. వచ్చిన సూచనల ఆధారంగా తుది మార్గదర్శకాలను ప్రకటించనుంది.

# ఆంధ్రప్రదేశ్‌లో చిన్నారుల డిజిటల్ భద్రతపై కీలక చర్యలు

**బలగం టీవీ, హైదరాబాద్**

చిన్నారులను సోషల్ మీడియా దుష్ప్రభావాల నుంచి రక్షించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 13 ఏళ్లలోపు పిల్లలను సోషల్ మీడియా వినియోగం నుంచి పూర్తిగా దూరంగా ఉంచే దిశగా ముసాయిదా చట్టాన్ని రూపొందించాలని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు.

ఉండవల్లిలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో మంత్రుల బృందం, ఉన్నతాధికారులు, ప్రముఖ సోషల్ మీడియా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పిల్లల సృజనాత్మకతకు భంగం కలగకుండా సంరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. 13 నుంచి 16 ఏళ్ల మధ్య వయస్సు గల పిల్లలకు వయస్సుకు అనుగుణమైన కంటెంట్ మాత్రమే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సోషల్ మీడియా వేదికగా మహిళలపై అవమానకర, విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లల డిజిటల్ భద్రతకు సంబంధించి ఆస్ట్రేలియా, సింగపూర్ దేశాల్లో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. వయస్సు నిర్ధారణ కోసం డిజిలాకర్‌తో అనుసంధానమైన ‘ఏజ్ టోకెన్’ విధానాన్ని పరిశీలించాలని తెలిపారు.

సోషల్ మీడియా ప్రభావంపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. పాఠశాలల్లో ‘నో బ్యాగ్ డే’ సందర్భంగా విద్యార్థులకు, పీటీఎం సమావేశాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. సమావేశంలో పాల్గొన్న సోషల్ మీడియా సంస్థల ప్రతినిధులు పిల్లలకు హానికరమైన కంటెంట్‌ను దూరంగా ఉంచేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యలకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్ తదితరులు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.






# ‘6 నెలలకు మించి బతకలేనన్నారు’

- క్యాన్సర్‌పై యువరాజ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు
- 2011 వరల్డ్‌కప్ తర్వాత క్లిష్ట పరిస్థితులు వెల్లడి

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ తన జీవితంలో ఎదుర్కొన్న క్యాన్సర్ వ్యాధి గురించి షాకింగ్ విషయాలను వెల్లడించారు. 2011 ప్రపంచకప్ అనంతరం తన ఆరోగ్యం తీవ్రంగా క్షీణించిందని, ఆ సమయంలో వైద్యులు తాను గరిష్ఠంగా 3 నుంచి 6 నెలలు మాత్రమే బతికే అవకాశం ఉందని చెప్పారని గుర్తుచేశారు.

ఇటీవల Michael Vaughanతో జరిగిన పోడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ యువరాజ్ ఈ విషయాలను వెల్లడించారు. 2011 ప్రపంచకప్ సమయంలోనే తన ఆరోగ్యం క్షీణించడం ప్రారంభమైందని, అయినప్పటికీ దేశం కోసం ఆడుతూ టోర్నీలో కీలక పాత్ర పోషించానన్నారు. ఆ టోర్నీలో ఆయన ‘ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్’గా నిలిచిన విషయం తెలిసిందే.

ప్రపంచకప్ అనంతరం తన స్కానింగ్‌లు పరిశీలించిన వైద్యుడు గుండె, ఊపిరితిత్తుల మధ్య ట్యూమర్ ఉందని, వెంటనే చికిత్స తీసుకోకపోతే ప్రాణాపాయం ఉంటుందని హెచ్చరించాడని తెలిపారు. కీమోథెరపీ చేయించుకోకపోతే ఎక్కువ కాలం బతకలేనని చెప్పడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు.

అదే సమయంలో గంగూలీ రిటైర్మెంట్ తర్వాత జట్టులో స్థానం దక్కిన సందర్భంలో ఆ అవకాశాన్ని వదులుకోలేకపోయానని యువరాజ్ పేర్కొన్నారు. కానీ ఆరోగ్యం విషమించడంతో చివరికి చికిత్స కోసం అమెరికాకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. చికిత్స సమయంలో తాను మళ్లీ క్రికెట్ ఆడలేనేమోనని అనిపించిందని, “క్రికెట్ లేకపోతే నేను ఎవరు?” అనే ప్రశ్న తనను వెంటాడిందన్నారు. అయితే క్యాన్సర్‌ను జయించి తిరిగి ఫిట్‌నెస్ సాధించి మళ్లీ టీమ్ ఇండియాలోకి రీఎంట్రీ ఇచ్చినట్లు తెలిపారు. క్యాన్సర్‌తో పోరాడి తిరిగి మైదానంలోకి వచ్చి ఆడిన యువరాజ్ సింగ్ కథ ఇప్పటికీ అనేక మందికి ప్రేరణగా నిలుస్తోంది.

# భారత తొలి తరం క్రికెటర్ సీడీ గోపినాథ్ కన్నుమూత

**96 ఏళ్ల వయసులో తుదిశ్వాస -- భారత క్రికెట్‌లో విషాదం**

**బలగం టీవీ, హైదరాబాద్**




భారత తొలి తరం క్రికెటర్ CD Gopinath కన్నుమూశారు. 1952లో టీమిండియా తొలి టెస్టు విజయాన్ని అందుకున్న జట్టులో సభ్యుడైన ఆయన 96 ఏళ్ల వయసులో తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న గోపినాథ్ చెన్నైలోని అడయార్ ప్రాంతంలో తన కుమార్తె నివాసంలో మరణించారు. ఆయన మరణంతో భారత క్రికెట్ వర్గాల్లో విషాదం నెలకొంది. గోపినాథ్ విధ్వంసక బ్యాట్స్‌మన్‌గా పేరు తెచ్చుకుని ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో నిలకడైన ప్రదర్శనతో జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. ఆటకు వీడ్కోలు పలికిన అనంతరం మేనేజర్‌గా, జాతీయ సెలెక్టర్‌గా కూడా సేవలందించారు.గోపినాథ్ మరణంతో ప్రస్తుతం Chandrakant Patankar (95) భారత క్రికెట్‌లో జీవించి ఉన్న అతి వయస్కుడైన క్రికెటర్‌గా గుర్తింపు పొందారు.

**అరంగేట్రంలోనే మెరుపులు**

తమిళనాడుకు చెందిన గోపినాథ్ 1939 మార్చి 1న జన్మించారు. ఇంగ్లండ్‌పై టెస్టు అరంగేట్రం చేసిన ఆయన తొలి మ్యాచ్‌లోనే అర్ధశతకం నమోదు చేసి ఆకట్టుకున్నారు. ఆ మ్యాచ్‌లో ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్ చేసిన ఆయన తొలి ఇన్నింగ్స్‌లో హాఫ్ సెంచరీ, రెండో ఇన్నింగ్స్‌లో 42 పరుగులు చేసి జట్టుకు కీలక సహకారం అందించారు. 1952లో చెన్నైలో జరిగిన టెస్టులో భారత్ తన తొలి విజయం నమోదు చేయగా, ఆ జట్టులో గోపినాథ్ సభ్యుడిగా ఉన్నారు. మొత్తం 8 టెస్టులు ఆడిన ఆయన 12 ఇన్నింగ్స్‌లలో 242 పరుగులు చేశారు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 83 మ్యాచ్‌లు ఆడి 42.16 సగటుతో 4,259 పరుగులు సాధించారు. భారత క్రికెట్ అభివృద్ధిలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయి.



# టీ20 క్రికెట్‌లో లారా కార్డోసో సంచలనం

- 9 వికెట్లతో ప్రపంచ రికార్డులిలి

**బలగం టీవీ, అమరావతి**

మహిళల టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర నమోదైంది. బ్రెజిల్ మహిళల జట్టు కెప్టెన్ లారా కార్డోసో అసాధారణ బౌలింగ్ ప్రదర్శనతో ప్రపంచ రికార్డు సృష్టించింది. బీసీఏ కలహారీ మహిళల టీ20ఐ టోర్నమెంట్-2026లో భాగంగా లెసోతోతో జరిగిన మ్యాచ్‌లో ఈ అరుదైన ఘనత సాధించింది. కేవలం 3 ఓవర్లు బౌలింగ్ చేసిన కార్డోసో 4 పరుగులు మాత్రమే ఇచ్చి ఏకంగా 9 వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టును చిత్తు చేసింది. ఈ ప్రదర్శనతో పురుషులు, మహిళల టీ20 క్రికెట్ చరిత్రలో ఒకే ఇన్నింగ్స్‌లో 9 వికెట్లు తీసిన తొలి క్రీడాకారిణిగా నిలిచింది.

ఇంతకుముందు పురుషుల టీ20ల్లో సోనమ్ యేషే (8/7), మహిళల క్రికెట్‌లో రోమాలియా (7/0) పేరిట ఉన్న రికార్డులను కార్డోసో అధిగమించింది. తన రెండో ఓవర్లో హ్యాట్రిక్ సాధించి లెసోతో పతనానికి నాంది పలికిన ఆమె, అనంతరం వికెట్ల వేట కొనసాగించింది. ఆమె ధాటికి లెసోతో జట్టు కేవలం 6.2 ఓవర్లలో 13 పరుగులకే ఆలౌట్ అయింది.

ముందుగా బ్యాటింగ్ చేసిన బ్రెజిల్ జట్టు రాబర్టా ఏవరీ (48), మోనిక్ మచాడో (69 నాటౌట్) అద్భుతంగా రాణించడంతో 202 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం బౌలింగ్‌లోనూ అదే జోరు కొనసాగించి 189 పరుగుల తేడాతో ఘన విజయం నమోదు చేసింది. ఈ టోర్నమెంట్‌లో బ్రెజిల్ జట్టు అద్భుత ఫామ్‌లో ఉంది. గతంలో జాంబియాపై జరిగిన మ్యాచ్‌లోనూ 174 పరుగుల తేడాతో గెలుపొందింది. ఆ మ్యాచ్‌లో జాంబియాను 26 పరుగులకే ఆలౌట్ చేయడంలో మరియా రిబేరో 5 వికెట్లతో, లారా కార్డోసో 3 వికెట్లతో కీలక పాత్ర పోషించారు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా రాణిస్తున్న బ్రెజిల్ జట్టు ఈ టోర్నీలో బలమైన పోటీదారుగా అవతరించింది.

# జలపాతంలో పడి ముగ్గురు విద్యార్థినుల మృతి

**బలగం టీవీ, అమరావతి**

అల్లూరి సీతారామరాజు జిల్లాలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. సెల్ఫీ తీసుకునే ప్రయత్నంలో అదుపుతప్పి జలపాతంలో పడి ముగ్గురు విద్యార్థినులు ప్రాణాలు కోల్పోయారు. మరో బాలిక పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన అనంతగిరి మండలం మూలగుమ్మి సమీపంలోని జలపాతం వద్ద జరిగింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హుకుంపేట మండలం జుంబువలస గ్రామానికి చెందిన త్రిష (17), రత్నకుమారి (16), పవిత్ర (16) ఇటీవల ఇంటర్మీడియట్ పరీక్షలు రాశారు. వీరితో పాటు అంజలి అనే స్నేహితురాలు కలిసి నలుగురూ అనంతగిరిలోని జలపాతాన్ని సందర్శించేందుకు వెళ్లారు. జలపాతం అంచున నిలబడి సెల్ఫీ దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి నలుగురూ నీటిలో పడిపోయారు. ఈ ఘటనలో త్రిష, రత్నకుమారి, పవిత్ర అక్కడికక్కడే మృతి చెందగా, అంజలి తీవ్రంగా గాయపడింది. స్థానికులు గమనించి వెంటనే సహాయక చర్యలు చేపట్టి అంజలిని లుంగపర్తి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికితీసి పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఒక్కసారిగా ముగ్గురు బాలికలు మృతి చెందడంతో జుంబువలస గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# పెద్దితో ఆటపాట?



ఇటీవల వచ్చిన 'కపుల్ ఫ్రెండ్లీ' చిత్రంలో చక్కటి అభినయంతో ప్రేక్షకుల్ని మెప్పించింది హైదరాబాదీ సొగసరి మానస వారణాసి. ప్రస్తుతం ఈ భామకు టాలీవుడ్‌లో మంచి ఆఫర్లొస్తున్నట్లు తెలిసింది. ఇదిలావుండగా రామ్‌చరణ్ 'పెద్ది' చిత్రంలో ఈ అమ్మడు ఓ ఐటెంసాంగ్‌లో నర్తించనుందని వార్తలు వినిపిస్తున్నాయి. తొలుత ఈ ప్రత్యేకగీతం కోసం మృణాల్ ఠాకూర్‌ను సంప్రదించారని, డేట్స్‌లేని కారణంగా ఆమె తిరస్కరించిందని సమాచారం. ఈ నేపథ్యంలో ఈ స్పెషల్‌సాంగ్ కోసం చిత్రబృందం యంగ్ హీరోయిన్‌ను ఎంపిక చేసే ప్రయత్నాల్లో ఉందట. ఇప్పటికే మానస వారణాసితో సంప్రదింపులు పూర్తయ్యాయని అంటున్నారు. అయితే ఈ వార్తలో నిజానిజాలెంతో తెలియాలంటే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న 'పెద్ది' చిత్రం ఒక్కపాట మినహా షూటింగ్‌ను పూర్తిచేసుకుంది. ఈ నెల 30న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది.

# అల్లు అర్జున్ బర్త్‌డేకు 'రాకా' సర్ప్రైజ్..





## ఫస్ట్ లుక్‌పై షారుఖ్ ఖాన్ రియాక్షన్ వైరల్!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు అంటే అభిమానులకు ఎప్పుడూ ప్రత్యేకమే. అయితే ఈసారి ఆ వేడుకలకు మరింత హైప్ తెచ్చింది 'రాకా' మూవీ అనౌన్స్‌మెంట్. బన్నీ బర్త్‌డే సందర్భంగా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో భారీ చర్చకు దారి తీసింది. కోలీవుడ్ సెన్సేషనల్ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో బాలీవుడ్ సూపర్ స్టార్ షారూఖ్ ఖాన్ కూడా ఈ లుక్‌పై స్పందించడం మరింత ఆసక్తిని రేకెత్తించింది. 'రాకా' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసిన షారుఖ్ ఖాన్, అల్లు అర్జున్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. "పోస్టర్ చాలా ఆసక్తికరంగా ఉంది.. నీలాగే అద్భుతంగా ఉంది. మీరు ఇద్దరూ కలిసి ఏ మ్యాజిక్ చేశారో చూడాలని ఆసక్తిగా ఉంది. అట్లీ స్టైల్‌లో చెప్పాలంటే ఇది 'మాస్.. మాస్.. మాస్' అనిపిస్తోంది" అంటూ ఆయన చేసిన కామెంట్ ఇప్పుడు వైరల్‌గా మారింది. 'రాకా' ఫస్ట్ లుక్‌లో అల్లు అర్జున్ లుక్ పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. ముఖాన్ని తోడేలు ఆకారంలోని చేతితో కప్పుకున్నట్లుగా డిజైన్ చేయడం పోస్టర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కళ్లకు కాటుక, గుండు తల, నెరిసిన గడ్డం, మీసాలతో బన్నీ పూర్తిగా కొత్త గెటప్‌లో కనిపించి అభిమానులను ఆశ్చర్యపరిచాడు. ఈ లుక్ చూసిన వారు ఆయనను గుర్తుపట్టలేనంతగా ట్రాన్స్‌ఫర్మేషన్ చేశారని కామెంట్లు చేస్తున్నారు. దర్శకుడు అట్లీ ఈ సినిమా గురించి మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యాడు. "ఇది కేవలం సినిమా కాదు.. నా 18 ఏళ్ల కల. ఈ కథ నా మనసులో చాలా కాలంగా ఉంది. ఈ ప్రయాణం నన్ను ఎంతో పరీక్షించింది. ఇది కేవలం ప్రారంభం మాత్రమే" అని ఆయన పేర్కొన్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపిక పదుకొనే హీరోయిన్‌గా నటిస్తున్నట్లు సమాచారం. అల్లు అర్జున్--అట్లీ కాంబినేషన్ కావడంతో ఈ సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇక ఈ చిత్రం 2027లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు అట్లీ దర్శకత్వంలో షారూఖ్ ఖాన్ నటించిన 'జవాన్' బ్లాక్‌బస్టర్ హిట్ సాధించిన సంగతి తెలిసిందే. 'రాకా' ఫస్ట్ లుక్‌తోనే భారీ హైప్ క్రియేట్ చేయగా, రాబోయే రోజుల్లో ఈ సినిమా గురించి మరిన్ని అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




# 'డెకాయిట్' ప్రీమియర్స్ లేవ్..

టాలీవుడ్ టాలెంటెడ్ యంగ్ హీరోస్ లో అడివి శేష్ హీరోగా మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా దర్శకుడు శానియల్ డియో తెరకెక్కిన 8 ఇంట్రెస్టింగ్ క్రైమ్ యాక్షన్ సినిమా డెకాయిట్ కోసం అందరికీ తెలిసిందే. అయితే ఈ సినిమా పట్ల సాలిడ్ బజ్ నెలకొనగా ఈ సినిమాకి కూడా ఇతర సినిమాల తరహాలోనే ముందు రోజే ప్రీమియర్స్ ఇండియాలో ప్లాన్ చేస్తారా అని ఎదురు చూశారు. అయితే ఫైనల్ గా ఈ ప్రీమియర్స్ పై ఓ క్లారిటీ వచ్చేసింది. ఈ సినిమాకి ఎలాంటి ప్రీమియర్స్ లేవు అన్నట్టే శేష్ క్లారిటీ ఇచ్చాడు. ఇండియా వైడ్ గా ప్రీమియర్స్ లేవు కానీ మొట్ట మొదటి షో మాత్రం ఏప్రిల్ 10న ఉదయం 8 గంటల షోస్ తో డెకాయిట్ మొదలు కానున్నట్లు కన్ఫర్మ్ చేసాడు. సో ఇండియా వైడ్ గా డెకాయిట్ కేవలం రిలీజ్ రోజు నుంచే మొదలు కానుంది అని చెప్పొచ్చు. ఇక ఈ సినిమాకి భీమ్స్ సంగీతం అందించగా అన్నపూర్ణ స్టూడియోస్ వారు నిర్మాణం వహించారు.

# జూన్‌లో రానున్న లెనిన్



తాజా చిత్రం 'లెనిన్' విషయంలో హీరో అక్కినేని అఖిల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై ఆసక్తిని పెంచాయి. రాయలసీయ గ్రామీణ నేపథ్యంలో బలమైన సామాజికాంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని తెలిసింది. మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మనం ఎంటర్‌ప్రైజెస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. బుధవారం అక్కినేని అఖిల్ పుట్టినరోజు సందర్భంగా స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేయడంతో పాటు రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. ఈ సినిమా జూన్ 26న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలో అఖిల్ గత చిత్రాలకు పూర్తి భిన్నంగా కనిపిస్తాడని, ఆయన మేకోవర్ సర్‌ప్రైజ్ చేస్తుందని, కెరీర్‌కు మలుపునిచ్చే చిత్రమవుతుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రానికి తమన్ స్వరకర్త.

# 'వారణాసి' నుంచి మహేష్ నెక్స్ట్ లెవెల్ ట్రీట్ అప్పుడేనా..?

రాజమౌళి ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'లో మహేష్ బాబు రాముడిగా కనిపించబోతున్నాడు. ఈ గెటప్‌కు సంబంధించిన షూటింగ్ ఇప్పటికే పూర్తి కావడంతో, మే 31న సూపర్ స్టార్ కృష్ణ గారి జయంతి సందర్భంగా ఈ లుక్‌ను విడుదల చేస్తారని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే, ఈ లుక్‌ను ఇప్పుడే రివీల్ చేయాలా లేక థియేటర్లో సర్ప్రైజ్‌గా ఉంచాలా అనే విషయంలో రాజమౌళి ఇంకా నిర్ణయం తీసుకోలేదు. లీకేజీల భయం ఉండటంతో ముందే విడుదల చేయడం మేలని కొందరు భావిస్తున్నారు. జక్కన్న నిర్ణయంపైనే ఈ సస్పెన్స్ ఆధారపడి ఉంది. మరోవైపు, మహేష్ రాముడి లుక్ అద్భుతంగా ఉండబోతోందని టాక్. ఇటీవల రణబీర్ కపూర్ 'రామాయణ' లుక్‌పై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవ్వడంతో, రాజమౌళి రూపొందించిన మహేష్ లుక్ ఖచ్చితంగా నెక్స్ట్ లెవల్‌లో ఉంటుందని ఫ్యాన్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆ అద్భుత దృశ్యం మే 31న కనిపిస్తుందో లేదో చూడాలి.



# రాకా ఎఫెక్ట్.. ట్రెండ్ అవుతున్న ఫ్లాప్ డైరెక్టర్..!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, మాస్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న 'రాకా'ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేసింది. 'పుష్ప 2' తర్వాత బన్నీ మరోసారి తన గ్లామర్‌ను పక్కన పెట్టి, 'యానిమల్' లుక్‌లో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఈ లుక్ చూసిన అభిమానులు బన్నీ మేకోవర్‌కు ఫిదా అవుతుంటే, సాధారణ ప్రేక్షకులు మాత్రం ఇంతటి భయంకరమైన గెటప్‌ను ఊహించలేదని అభిప్రాయపడుతున్నారు. అయితే, ఈ సినిమా టైటిల్ 'రాకా' చుట్టూ ఇప్పుడు అనూహ్యమైన చర్చ మొదలైంది. గతంలో జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'శక్తి' చిత్రంలో విలన్ పాత్ర పేరు కూడా రాకా కావడంతో, నెటిజన్లు ఆ పాత డిజాస్టర్‌ను గుర్తు చేస్తున్నారు. దీంతో 'శక్తి' దర్శకుడు మెహర్ రమేష్ పేరు అకస్మాత్తుగా ట్రెండింగ్‌లోకి వచ్చింది. పాత పరాజయాలను ప్రస్తుత ప్రాజెక్టుతో ముడిపెడుతూ నెటిజన్లు మీమ్స్ వేయడం వల్ల సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుంది. ఈ



నెగిటివ్ ట్రెండ్‌పై అల్లు అర్జున్ ఫ్యాన్స్ గట్టిగానే కౌంటర్ ఇస్తున్నారు. కేవలం టైటిల్ కలిసినంత మాత్రాన పాత ఫ్లాప్ సినిమాలను ప్రస్తావించడం కరెక్ట్ కాదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సేఫ్ జోన్‌లో ఉండకుండా, ప్రతి సినిమాకు కొత్తగా ప్రయత్నించే బన్నీ సాహసాన్ని మెచ్చుకోవాల్సింది పోయి, కావాలనే కొందరు నెగిటివిటీని వ్యాప్తి చేస్తున్నారని వారు వాదిస్తున్నారు. ఏదేమైనా, ఒక్క పోస్టర్‌తో సినిమా రేంజ్‌ను ఎక్కడికో తీసుకెళ్లడంలో అల్లు అర్జున్ మరోసారి సక్సెస్ అయ్యాడని చెప్పాలి.



# ధురంధర్ 2.. ఈ మార్క్ అందుకోడం కష్టమేనా!

బాలీవుడ్ స్టార్ అండ్ టాలెంటెడ్ హీరో రణ్వీర్ సింగ్ హీరోగా సారా అర్జున్ హీరోయిన్ గా దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన సెన్సేషనల్ సీక్వెల్ సినిమానే ధురంధర్ 2. సాలిడ్ స్పై ఏక్షన్ సినిమాగా దీనిని ప్లాన్ చేయగా చాలా మంది ఈ పార్ట్ 2 సినిమా సరికొత్త రికార్డులు సెట్ చేస్తుంది అని భావించారు. అలా అంచనాలుకి తగ్గట్టు గానే పార్ట్ 2 కి బంపర్ ఓపెనింగ్స్ కూడా పడ్డాయి. కానీ ఈపాటికే వరల్డ్ వైడ్ అన్ని రికార్డులు ఈ సినిమా తుడిచేస్తుంది అని భావించారు. అదే విధంగా 2000 కోట్ల గ్రాస్ క్లబ్ లో ఈ సినిమా చేరుతుంది అని భావించారు. కానీ ఇప్పుడు సినిమా స్టడీగానే ఉంది కాని ఫైనల్ రన్ లో 2000 కోట్ల మార్క్ అందుకోవడం అంటే ఒకింత కష్టం అనే అనుకోవాలి. పార్ట్ 1 దెబ్బకి పార్ట్ 2 ఈ పాటికే సెన్సేషనల్ రికార్డులు కొడుతోంది అని అంతా భావించారు కానీ ఇది నెమ్మదించింది. సో ధురంధర్ 2 ఆ 2 వేల కోట్ల మార్క్ అందుకుంటుందో లేదో చూడాలి.